ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 12, 2003

హ్యాపీ బర్త్‌డే

(12-1-2003 నుండి 18 -1-2003 వరకు)

ఎస్.వి.బి.ప్రదీప్ కుమార్
9॥సం,12. 1. 1994
బాల మహా లక్ష్మి-వెంకటపున్నారావు
తుళ్ళూరు- గుంటూరు

ఎన్.ప్రద్యుమ్న
3॥సం,12. 1. 2000
వజ్రాంజని-వెంకటేశ్వర్లు
భట్టిప్రోలు-గుంటూరు

అబూబకర్ సిద్దిఖ్
1॥సం,13. 1. 2002
అఫ్‌సర్-ఎం.డి.రఫీఖ్
పరకాల-వరంగల్

సుమేరా ఫిర్దోస్
5॥సం,14. 1. 1998
షాహిన్ సుల్తానా- హసన్ షరీఫ్
మౌలాలి- హైదరాబాద్

కె. క్రాంతి కిరణ్
4॥సం,14. 1. 1999
సులోచన- రవి
ఉప్పల్- హైదరాబాద్

ప్రవల్లిక
2॥సం,16. 1. 2001
అనూరాధ-శ్రీనివాస్
రేపల్లె- గుంటూరు

కె. గోపి
జనవరి-16
రాజేశ్వరి- వసంతయ్య
జి.పల్లెపాలెం-గంగపట్నం

కె.లలితారాణి
6॥సం,17. 1. 1997
మాధవి- తులసీరావు
రాజోలు- తూ॥గో॥

పి.మహేశ్
3॥సం,18. 1. 2000
అనిత- రవీందర్
రేగొండి-పెద్దమల్

...దుపరి గర్భధారణలకు ఈ రిస్క్ పెరుగుతుంది. ప్రస్తుత గర్భధారణలో అమ్నియోసెంటెసిస్ వంటి ప్రసవపూర్వ పరీక్ష నిర్వహిస్తే కడుపులోని అండంలో డౌన్ సిండ్రోమ్ లేక మరే ఇతర సమస్యలున్నా బయటపడతాయి.

గర్భంలో పిండాన్ని ఆవరించి ఉండే ఉమ్మనీరును కొద్దిమొత్తంలో జన్యుపరీక్షల నిమిత్తం సేకరించడాన్నే అమ్నియోసెంటెసిస్ అంటారు. గర్భం ధరించిన తర్వాత 13-18 వారాల మధ్యకాలంలో అల్ట్రాసౌండ్ సహాయంతో దీనిని జరుపుతారు. ఇది సురక్షితమైన పరీక్ష. ఉమ్మనీరులో పిండకణాలుంటాయి. వీటిని జన్యు పరీక్షలకు ఉపయోగిస్తారు.

గతంలో ఒక మహిళకు మూడుసార్లు తొలి మూడుమాసాల్లోనే గర్భస్రావమైతే దీనికి ఆమెలోని లేక ఆమె భర్తలోని జన్యుసమస్య కారణమై ఉంటుందా ?

సమస్యకు భర్త లేక భార్యలోని జన్యులోపాలు కారణం కావచ్చు. సమస్య పరిష్కారానికి ఈదిగువ సూచించిన వాటిలో ఒకటి లేక అంతకంటే ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తే మంచిది.

- గర్భస్రావంలో వెలికి వచ్చిన పదార్థం లేక పిండంపై క్రోమోజోమ్ విశ్లేషణ (50 శాతం గర్భస్రావాలకు క్రోమోజోమ్ సమస్యలే కారణమవుతాయి)
- తల్లిదండ్రుల రక్తంపై క్రోమోజోమ్ విశ్లేషణ.
- భవిష్యత్ గర్భధారణలకు ప్రసవపూర్వ పరీక్షలు. గర్భధారణ సమస్య యాదృచ్ఛికమా, వంశపారంపర్యమా? భవిష్యత్తులో గర్భం ధరిస్తే ఎదురయ్యే సమస్యలు ఏమిటి? పరిష్కారమార్గాలు ఏమిటి? మొదలైన అంశాలను ఈ పరీక్షల నివేదికలు విశదీకరిస్తాయి.

గతంలో తరచుగా గర్భస్రావమై ఇప్పుడు మళ్ళీ గర్భం దాలిస్తే ప్రసవపూర్వ పరీక్షలు అవసరమా?

తరచుగా గర్భం నిలవకపోవడం అనే సమస్య తదుపరి గర్భాల పిండాలలో అవకరాలు ఏర్పడే అవకాశాలు పెంచుతుంది. అందువల్ల ప్రసవపూర్వ పరీక్షలు సూచించడం జరుగుతుంది. పిండంలో క్రోమోజోమ్ సమస్యలు లేవని నిర్ధారించేందుకు ఇలా చేస్తారు.

22 సంవత్సరాల వయస్సులో బహిష్టు సరిగా రాకపోతే గర్భం దాల్చే అవకాశముందా ?

సమస్య నిర్ధారణకు క్రోమోజోమ్ విశ్లేషణ అతి ముఖ్యమైనది. లైంగిక క్రోమోజోమ్ లేకపోవడం లేక ఇతర లోపాలు ఈ పరిస్థితికి కారణం కావచ్చు. జన్యు పరీక్షల ఫలితాలపైనా సాధారణ గర్భధారణ లేక కృత్రిమ గర్భధారణ అవకాశాలు ఆధారపడి ఉంటాయి.

పెళ్ళయి పదేళ్ళయినా సంతానం కలగక అన్ని పరీక్షలలో సాధారణ ఫలితాలు వస్తే సమస్య జన్యుపరమైంది కావచ్చునా ?

అవును నిజమే. అది జన్యుపరమైన సమస్యే కావచ్చు. అనేక వంధ్యత్వ సమస్యలకు జన్యు సమస్యలే కారణం. అందువల్ల భార్యభర్తలిద్దరూ క్రోమోజోమ్ రక్త పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

అలాగే కృత్రిమ గర్భధారణను ఎంచుకునే దంపతులు (ఐవిఎఫ్, ఐసిఎస్ఐ లేక ఇతర గర్భధారణ పద్ధతులు) క్రోమోజోమ్ పరీక్షలు జరిపించుకుంటే జన్యుపరమైన కారణాలు బైటపడటమే కాకుండా పిండంలో అవకరాల సమస్య తగ్గించే అవకాశాలు ఉంటాయి.

గర్భధారణ కాలంలో పిండంలో అసాధారణ మార్పులకు కారణమయ్యే ఇతర అంశాలేమిటి ?

- 35 సంవత్సరాల పైచిలుకు వయస్సులోఉండే స్త్రీకి గర్భధారణ సమస్యలు అధికంగా ఉంటాయి.
- రక్త సంబంధీకులను పెళ్లి చేసుకోవడం వల్ల (మేనరికాలు) పిల్లలకు జన్మతః లోపాలు వచ్చే అవకాశం పెరుగుతుంది.
- అణుధార్మికత, మరుగు మందులు, రసాయనాల ప్రభావానికి గురికావడం.
- ఇతర వైద్య పరీక్షలలో అసాధారణ ఫలితాలు (అల్ట్రాసౌండ్, బయోకెమికల్ పరీక్షలు)

మెటర్నల్ సీరం ఎఎఫ్‌పి స్క్రీనింగ్ టెస్టు అంటే ఏమిటి? ప్రతి గర్భవతి ఈ పరీక్ష చేయించుకోవాలా ?

అవును. అల్ట్రాసౌండ్ స్కానింగ్ లాగే ఈ స్క్రీనింగ్ పరీక్ష (మెటర్నల్ సీరం ఎఎఫ్‌పి లేక ట్రిపుల్ స్క్రీన్ టెస్ట్) గర్భవతులందరికీ సిఫారసు చేస్తారు. బహిర్గతమైన వెన్నుపూసతో, డౌన్‌సిండ్రోమ్‌తో లేక ట్రైసోమి 18 సమస్యతో కూడిన బిడ్డకు జన్మనిచ్చేందుకు గల అవకాశాలు ఈ పరీక్షలో బైటపడతాయి.

ఈ పరీక్షలో అసాధారణ ఫలితాలు వస్తే తదుపరి ఉమ్మ నీటి క్రోమోజోమ్ విశ్లేషణ కూడా రోగ నిర్ధారణకు అవసరం కావచ్చు.

క్రోమోజోమ్ విశ్లేషణలో లోపం కనబడక పోవడం యొక్క అర్థం ఏమిటి ?

సైటో జీన్‌టెక్ పరీక్ష ద్వారా సంఖ్యాపరమైన, నిర్మాణపరమైన క్రోమోజోమ్ అవకరాలు నిర్ధారణ అవుతాయి. అయితే ఏకజన్యు లోపాలు, మైక్రో డిలిషన్స్, ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ సమస్యలు వంటి ఇతర కారకాలు మాత్రం ఈ పరీక్ష ద్వారా నిర్ధారణ కావు.

అక్కకు థాలసేమియా రక్తవ్యాధి ఉంది చెల్లి గర్భవతి అయితే ఆందోళన చెందాల్సిన అవసరం ఉందా ?

థాలసేమియా (తీవ్రమైన రక్తహీనత) వంటి వ్యాధులు ఏకజన్యు లోపాల వల్ల వస్తాయి. ఇవి సంక్లిష్ట వారసత్వ మార్గంలో సంక్రమిస్తాయి. జన్యుశాస్త్ర నిపుణునితో సలహా సంప్రదింపుల ద్వారా పరిస్థితిపై స్పష్టమైన అవగాహన కలుగుతుంది.

మనుషులందరిలోనూ ప్రతికణంలో ఒకే తరహా జన్యువులు రెండు ఉంటాయి. థాలసేమియా అనేది రిసెసివ్ సింగిల్ జీన్ డిజార్డరు కారణంగా వస్తుంది. ఒకే తరహాకు చెందిన రెండు జన్యువులూ లోపభూయిష్టంగా ఉండడమే ఈ పరిస్థితికి మూలం. అక్కకు తల్లి తండ్రి నుంచి రెండూ లోపభూయిష్టమైన జన్యువులు సంక్రమించి ఉండవచ్చు. అంటే చెల్లిలోనూ లోపభూయిష్టమైన జన్యువు ఉండి ఉండవచ్చు. (వాహకులు అన్నమాట.) ప్రస్తుత పరిస్థితుల్లో భర్త కూడా వాహకులు అవునా కాదా? అనే దానిమీద పుట్టబోయే పాపకు వ్యాధి వస్తుందా రాదా? అనేది ఆధారపడి ఉంటుంది.

అక్క పరిస్థితిని పరీక్షల ద్వారా కచ్చితంగా నిర్ధారణ చేయాలి. అలాగే చెల్లికి, ఆమె భర్తకు వాహకులకు చేయించే పరీక్షలు చేయించాలి. గర్భం ధరించిన తర్వాత ప్రసవ పూర్వ పరీక్షలూ చేయించాల్సి రావచ్చు.

భర్తకు కండరాల సమస్య ఉంది, అది ఆయన కుటుంబంలో అందరికీ వంశపారంపర్యంగా సంక్రమిస్తున్నప్పుడు ఆ దంపతులు బిడ్డను కనవచ్చా ?

కండరాల సమస్యలలో అనేక రకాలున్నాయి. అందులో కొన్ని ఏకజన్యు, మరికొన్ని క్రోమోజోమ్ లోపాల కారణంగా వస్తాయి. దీనికి ఏదైనా సిఫార్సు చేయాలంటే ముందుగా జన్యుశాస్త్ర నిపుణునితో సలహా సంప్రదింపులు నిర్వహించడం తప్పనిసరి. ఉదాహరణకు భర్త సమస్యను డచెన్ మస్కులర్ డిస్ట్రఫీగా గుర్తించడం జరిగిందనుకుందాం. ఇది లైంగిక క్రోమోజోమ్‌కు సంబంధించిన వ్యాధి. భార్య కూడా దీని వాహకులు కాకపోతే వారి పిల్లలకు వచ్చే అవకాశాలు తక్కువ. అయితే వారికి పుట్టే ఆడపిల్లలు మాత్రం వాహకులు అవుతారు.

జన్యుపరమైన సలహా సంప్రదింపులు అంటే ఏమిటి ? ఇది ఏ రకంగా తోడ్పడుతుంది ?

అనుమానిత జన్యుదోషాలను సరైన విధంగా అంచనా వేసేందుకు జన్యుపరమైన సలహా సంప్రదింపులు ఎంతగానో తోడ్పడతాయి. ప్రస్తుత వైద్య పరిస్థితి, వంశవృక్షాల సహాయంతో కుటుంబ చరిత్ర గురించిన లోతైన చర్చతో ఇది కూడుకుని ఉంటుంది. ఈ నివేదిక భవిష్యత్ గర్భధారణలో తలెత్తే సమస్యలు, అలాగే జన్యులోపం యొక్క పరిణామం సూచిస్తుంది.

('జీన్‌టెక్' సౌజన్యంతో)

సామాజిక మార్పు



అంపశయ్య నవీన్

మిత్రుడు ఎల్లారెడ్డి మూడు రోజుల క్రితం ఇక్కడి జిల్లా గ్రంథాలయంలో ఓ సాహిత్య సమావేశాన్ని ఏర్పాటు చేసి నన్ను సాహిత్యాన్ని గూర్చి మాట్లాడమని ఆహ్వానించాడు.

నేను వెళ్లేటప్పటికి గ్రంథాలయంలో వార్తాపత్రికలూ, వారపత్రికలూ చదువుతూ ఓ యాభై మంది పాఠకులు కూర్చొని ఉన్నారు.

నేనేదో ఏకథాటిగా వాళ్ళనుద్దేశించి మాట్లాడటం కాకుండా వాళ్ళతోటే మాట్లాడిద్దామని నిర్ణయించుకున్నాను.

"మీలో ప్రతిరోజూ గ్రంథాలయానికొచ్చి ఇలా వార్తాపత్రికలు, ఇతర మ్యాగజైన్లు చదివే వాళ్ళెంతమందుంటారు?" అని అడిగితే ఓ ఇరవై మంది వరకు చేతులెత్తారు.

"మీరు లైబ్రరీకొచ్చి ఎక్కువగా ఏం చదువుతారు?" అని అడిగితే ఎక్కువ మంది 'వార్తాపత్రికలే'నని సమాధానం చెప్పారు. "సాహిత్యం చదివేవాళ్లు... అంటే కవితలుగానీ, కథలుగానీ, నవలలూగానీ చదివేవాళ్ళు ఎవరూ లేరా?" అని అడిగితే ఓ ఐదారుగురు మాత్రమే "మేం సాహిత్యం కోసమే లైబ్రరీకొస్తున్నా"మని చెప్పారు.

"వార్తల్ని మీరు ప్రతిరోజూ టీవీలోనూ, రేడియోలోనూ చూడటమో, వినడమో చేస్తారు గదా... అలాంటప్పుడు లైబ్రరీకొచ్చి వార్తాపత్రికలు తిరగెయ్యడమెందుకు?" అని అడిగితే "వార్తా పత్రికల్లో ప్రతి విషయాన్నీ చాలా వివరంగా రాస్తారు. వార్తలే కాకుండా ఇంకా అనేక విషయాల్ని వార్తా పత్రికలు అందిస్తున్నాయి. అలాగే వార్తల పూర్వాపరాల్ని కూడా వార్తాపత్రికలిచ్చినట్టుగా టీవీలివ్వవు" అని కొందరు సమాధానం చెప్పారు.

"ఒకప్పుడు... అంటే మేం మీ వయస్సులో ఉన్నప్పుడు సాహిత్యం చదివేవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఇప్పుడెందుకు తగ్గిపోయింది. మీకు కథల్నిగానీ, నవలల్ని గానీ, కవిత్వాన్ని గానీ చదవాలన్న ఇంటరెస్ట్ ఎందుకుండటం లేదు?" అని అడిగితే ఓ యువకుడు వెంటనే లేచి "అవి చదవడం వల్ల లాభమేమిటి సార్!" అన్నాడు.

"వార్తా పత్రికలు చదవడం వల్ల లాభమేమిటి?" అని అడిగితే "కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయటానికి, ఏదన్నా ఉద్యోగం సంపాదించుకోవడానికి ఈ నాలెడ్జి ఉపయోగపడ్తుంది కదా!" అని సమాధానం.

"సాహిత్యం చదవడం వల్ల మీలో సంస్కారం పెరుగుతుంది. మిమ్మల్ని మీరు తెలుసుకోగలుగుతారు. మీలో ఉన్న చెడును తొలగించుకొని, మంచిని పెంచుకోవడానికి సాహిత్యం మీకు తోడ్పడుతుంది... అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకోవడానికి ఇష్టపడ్తారు కదా!.. కానీ అద్దంలో మీరు మీ బాహ్య రూపాన్ని మాత్రమే చూసుకుంటారు.. మంచి సాహిత్యంలో మీరు మీ లోపలి రూపాన్ని... అంటే మీ అంతరంగాన్ని.. మీలో మీకు తెలీని మీ అంతఃచేతనని చూసుకోగలుగుతారు... మిమ్మల్ని మీరు తెలుసుకొని తద్వారా సమాజాన్ని తెలుసుకోవాలంటే సాహిత్యమొక్కటే మార్గం... సమాజాన్ని అభ్యుదయ పథం వైపు మళ్ళించేది కూడా సాహిత్యమే... సమాజంలో పేరుకొని పోయిన మూఢవిశ్వాసాల్ని, కుళ్ళును, కుత్సితాన్ని తొలగించడానికి కూడా సాహిత్యమే తోడ్పడుతుంది. అలాంటి సాహిత్యానికి మీరు, మీలాంటి యువకులు దూరమైపోవడం చాలా దురదృష్టకరం" అన్నాను.

"ఇంతమంది రచయితలున్నారు... ఎన్నో పుస్తకాలు రాస్తున్నారు.. అయినా మన సమాజం ఏం మారింది సార్! మన సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢ విశ్వాసాలేమన్నా తొలగిపోయాయా? ఈనాడు కూడా.. చాలా గ్రామాల్లో చేతబళ్ళు చేస్తున్నారని అనుమానించి కొందర్ని సజీవ దహనం చేస్తున్నారు... ఎవరన్నా కాస్త విచిత్రంగా ప్రవర్తిస్తే భూత వైద్యుల దగ్గరకు పరుగెత్తుతున్నారు... సాహిత్యం వల్ల సమాజం మంచివైపు మళ్ళుతుందని మీరంటున్నారు... కానీ ఇన్నేళ్ళ సాహిత్యం సమాజాన్ని ఏం మార్చిందని?" అన్నాడో యువకుడు లేచి నిల్చొని.

"సమాజాన్ని మంచివైపు మళ్ళించే అంశాల్లో సాహిత్యం కూడా ఒకటని నిస్సందేహంగా చెప్పొచ్చు. అలాగే సమాజం ఏమీ మారలేదనడం నిజం కాదు. ఒకప్పటి సమాజానికీ ఇప్పటి సమాజానికీ చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది – మూఢనమ్మకాలు ఇప్పటికీ ఉన్నాయనడం నిజమే – కానీ విద్యావ్యాప్తి జరుగుతున్న కొద్దీ, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరుగుతున్న కొద్దీ మూఢవిశ్వాసాలు తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు సూర్యగ్రహణమో, చంద్రగ్రహణమో వచ్చిందంటే ప్రజలు భయపడిపోతుండేవాళ్లు....రాహుకేతువులు సూర్య చంద్రుల్ని మింగేస్తున్నాయని నమ్మే వాళ్ళు. ఇప్పుడలా చేస్తున్నారా? సూర్యగ్రహణం, చంద్రగ్రహణం లాంటివి ఎందుకేర్పడతాయో ఇవ్వాళ్ళ సైన్స్ రుజువులతో సహా వివరిస్తున్నది... అలాగే ఇదివరకు పల్లెటూర్లల్ల కలరా, మశూచి లాంటి వ్యాధులొస్తే అవి ముత్యాలమ్మ ఆగ్రహించడం వల్లనే వచ్చాయని నమ్మేవాళ్ళు.. ముత్యాలమ్మకు పూజలు చేసేవాళ్ళు... జంతువుల్ని బలిచ్చే వాళ్ళు... ఇప్పుడలా చేస్తున్నారా? ఇవ్వాళ్ళ ఇలాంటి జబ్బులొస్తున్నాయంటే వెంటనే డాక్టర్లదగ్గరకు పరుగెత్తుతున్నారు... టీకాలు వేయించుకుంటున్నారు... మూఢ విశ్వాసాలు చాలా వరకు తగ్గిపోవడం వల్లనే కదా ఈ మార్పులొచ్చింది? ఇక కుల వ్యవస్థ అంటారా? అది పూర్తిగా పోయిందని చెప్పలేను గాని దాంట్లో కూడా కొన్ని మార్పులొచ్చాయి. ఈ కులంలో పుట్టిన వాడు ఆ కుల వృత్తినే చెయ్యాలన్న నియమం పోయిందా? లేదా? ఇప్పటికీ కులవృత్తుల్నే అంటిపెట్టుకొని ఉన్న వాళ్ళు లేరని కాదు... కానీ ఇదివరకటిలా ఏ కులం వాడు ఆ కులవృత్తినే తప్పనిసరిగా చెయ్యాలన్న నియమమైతే పోయింది. ఇదొక మంచి మార్పు కాదంటారా? అలాగే ఒకప్పుడు మన దేశంలో స్త్రీలను ఇళ్ళల్లోంచి బయటకు రానిచ్చే వాళ్ళు కారు.. వాళ్ళను చదువుకోనిచ్చే వాళ్ళు కారు.. ఉద్యోగాలు చెయ్యనిచ్చే వాళ్ళు కారు.. ఇప్పుడా పరిస్థితి మారిందా? లేదా? స్త్రీల పట్ల ఒకప్పటి పురుషుల దృక్పథం కూడా మారుతున్నది. స్త్రీ అంటే పురుషుడి సెక్స్ కోరికల్ని తీర్చే ఓ పదార్థమనో, పిల్లల్ని కనే యంత్రమనో, వంట చేసి పెట్టే వంటమనిషో అని కాకుండా స్త్రీ కూడా మనలాంటి ఫీలింగ్స్ ఉన్న ఓ మనిషే అన్న భావం ఇవ్వాళ్ళ పురుషుల్లో స్థిరపడుతున్నది. మరో ముఖ్యమైన మార్పేమిటంటే పోరాటం ద్వారా, స్వయం కృషి ద్వారా మన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చుననే భావం కూడా ఇవ్వాళ్ళ సమాజంలో వ్యాపిస్తున్నది. పూర్వం పేదరికానికి కారణం కర్మ అనుకునే వాళ్ళు... పూర్వజన్మ ఫలితమని ప్రజల్ని నమ్మించే వాళ్ళు... సోషలిస్టు భావాల వ్యాప్తి వల్ల ఇప్పుడా పరిస్థితి మారింది. ఇదివరకటిలా ప్రజలు దోపిడీని నిశ్శబ్దంగా భరించడం లేదు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలన్న చైతన్యం ఇవ్వాళ్ళ ప్రజల్లో వ్యాపిస్తున్నది. ఇలా సమాజం మంచివైపు మారుతున్నది – దీనివెనక ఎంతోమంది మేధావుల ఆలోచనలున్నాయి... ఎంతోమంది రచయితల రచనలున్నాయి.. ఎంతోమంది సంఘ సంస్కర్తల కృషి ఉంది. సమాజం మారుతున్నది. కానీ ఆశించినంత వేగంగా మారడం లేదు. ముందుముందు ఈ మార్పువేగవంతమవుతుంది. సామాజిక మార్పుకు ఎన్నో అంశాలు దోహదం చేస్తాయి. అందులో సాహిత్యం కూడా ఒకటి..." అన్నాన్నేను.

అంతటితో ఆ సమావేశం ముగిసింది. చాలా మంది లైబ్రరీలోంచి బయటకెళ్తూ నేను చెప్పిన విషయాల్ని గూర్చి వాళ్ళళ్ళో వాళ్ళు చర్చించుకోవడాన్ని నేను గమనించాను. ◆

..లా...!



3 చేప పిల్ల ఓ రోజు పొద్దున్నే లేచింది. పళ్లు తోముకుంది. ..ో స్నానం చేస్తోంది. 'ఆహా జలకాలాటలలో...' అని .. పాడుకుంటోంది. సరిగ్గా ఆ సమయంలో... ఓ జాలరి ..ేశాడు. ఇంకేముంది? మన పిల్ల చేప అందులో ..ంది. కాని ఎలాగో తన తెలివితేటలన్నిటినీ ఉపయోగించి .. అది ఎలా...! వల అడుగున ఒక చుక్క వుందే. అక్కడ ..కండి.

సువాసనల విందు

ఓసారి నసీరుద్దీన్ దగ్గరకు ఓ పేదవాడు వచ్చాడు. అతను చాలా దీనంగా చూస్తూ 'నసీరుద్దీన్‌గారూ ! మేం చాలా పేదవాళ్లమండీ! మొన్న నేను ఓ భూస్వామి ఇంటి ముందునుంచి వెళ్తున్నాను. అప్పుడు ఆ ఇంట్లోంచి మంచి వంటకాలు చేస్తున్నట్లు సువాసనలు వచ్చాయి. నేను వుండబట్టలేక వాటి వాసనలు పీల్చుకున్నాను. అది చూసిన భూస్వామి నన్ను న్యాయాధికారి దగ్గరకు తీసుకెళ్లాడు. ఇవాళ తీర్పు చెప్తారండీ. మీరే నన్ను కాపాడాలి' అని వేడుకున్నాడు. సరే పద అంటూ అతని వెనుక నడిచాడు నసీరుద్దీన్. అప్పటికే భూస్వామి న్యాయాధికారి దగ్గర కూర్చుని వున్నాడు. న్యాయాధికారి పేదవాడిని చూస్తూనే కోపంగా ముఖం పెట్టి 'సిగ్గులేనివాడా! వంటకాల సువాసనలతో కడుపు నింపుకున్నావంట. అందుకు డబ్బు ఎంత కట్టాలో లెక్కకట్టి వెంటనే ఇవ్వు' అన్నాడు. అప్పుడు నసీరుద్దీన్ న్యాయాధికారి దగ్గరకెళ్లి 'అయ్యా! కోప్పడకండి అతను మా అన్నయ్య.. అతను కట్టాల్సిన డబ్బులు నేను చెల్లిస్తాను' అంటూ డబ్బు సంచీ బయటకు తీశాడు. ఆ మూటను భూస్వామి చెవి దగ్గర పెట్టి మోగించాడు. 'వినిపిస్తుందాండీ' అనడిగాడు. 'ఆ బాగా వినిపిస్తోంది' అన్నాడు భూస్వామి. 'అయితే అన్నయ్య బాకీ తీరిపోయింది. అతను చూసిన వంటకాల వాసనలకు డబ్బు చప్పుడు విన్నందుకు చెల్లు" అంటూ పేదవాడిని తీసుకుని వెళ్లిపోయాడు నసీరుద్దీన్.

..లం స్నేహం

..రపు శ్రీలత,
9 సం॥
4 వ తరగతి
..కోకో, రన్నింగ్.
..రునామా :
శ్రీలత, డాటరాఫ్ విష్ణు, నర్కూడ, శంషాబాద్, రంగారెడ్డి.

పేరు: నొల్లు అప్పలరాజు,
వయసు : 18 సం॥
చదువు : 10వ తరగతి,
హాబీలు: క్రికెట్ ఆడడం
పూర్తి చిరునామా :
నొల్లు అప్పలరాజు, సన్నాఫ్ తాతారావు, కొత్తజహిరిపేట, విశాఖ.

ఆ ఒక్క అక్షరం ఏదో!

?	ల
	ను
	స్తం
	రం
	త

పక్కన ఒక్క అక్షరం పెద్దగా రాస్తే చాలు, అన్నిటికీ సరిపోతుంది. మీరు రాసిన ఆ ఒక్క అక్షరంతో ఐదు పదాలు తయారవుతాయన్నమాట. మరి రాస్తారా. తెలియకపోతే వచ్చే వారం ఇదే శీర్షికలో చూడండి.

వేళ్లతో బొమ్మ

నేస్తాలూ!

మీకు చేతి వేళ్లతో బొమ్మలు చేయడం వచ్చా! రాకపోతే ఈ వారం చెప్పనా. ముందుగా గోడ దగ్గర నిలబడండి. మీ రెండు చేతులను పక్కన బొమ్మలో చూపించినట్లు ఒకదానిమీద ఒకటి వుంచండి. అంతే చక్కటి ఎలుగుబంటి నీడ కనిపిస్తుంది. ఎలా వుంది ఈ వారం మేజిక్? మీ స్నేహితులకు చేసి చూపించండి. మళ్లీ వచ్చే వారం మరో మేజిక్ చెప్తానే. అప్పటి వరకు టాటా.



మేజిక్! మేజిక్!!

డ్వాక్రా సూ(దూ)పర్ బజార్!

రుక్మిణి

"వామ్మో.. వామ్మో... రాధో.. రంగమ్మో... గీపెట్టినిండా అమెరికా పేస్టులు.. వామ్మో.. పండ్లు లేనోళ్ళు కూడా తోముకోవచ్చట! రుద్దుకుంటే నోరంతా మిలమిలా మెరిసిపోద్ది!'' వనజ బహుసంబరంగా పెద్ద అట్టపెట్టె పీకి మురిసిపోతుంది.

"లక్ష్మీ... లక్ష్మీ... చూడు... ఎన్నిరకాల షాంపు పాకీట్లో... అబ్బో మొత్తం నూట తొంబై రకాలు! గిన్ని రకాలేం చేసుకోవాల్నబ్బా..!" రంగమ్మ మహా విడ్డూరంగా దండలు దండలు షాంపూ పాకెట్లని సంబరంగా మెడచుట్టూ వేసుకుంది. దీన్నంతా అక్కడికి వచ్చిన 'అప్నాబజార్' మరియు 'కార్స్' సంస్థ ప్రతినిధి ఓపిగ్గా వివరణ మొదలు పెట్టాడు.

"అవునమ్మా.. ఒక్కో మనిషి తల బొచ్చుకు తగ్గట్టు తయారు చేసిన నాణ్యమైన షాంపూలు....సబ్బులు.. తలనూనెలు.. వీటిని వాడకుండా మన పల్లె జనాలు బతకడం బహుకష్టం! అదుగో షేవింగు క్రీములు.... వాసన పౌడర్లు... చాలా నాణ్యమైనవి. ఈ 'శ్రేష్టం' ముద్ర కూడా మీకే ఇస్తున్నాం - అన్నిటి మీదా గుద్దేయండి - ఏం ఫర్వాలేదు - అసలు మీ పల్లెల్లో జనం సుఖంగా బతకాల్ననే గదా"!

"అవును పల్లె సీమలు పచ్చంగుండాలె.. సుఖంగుండాలె!"

"అందుకే చెవుల గూబిలి తీసుకునే పుల్లలు.. గెడ్డంగీక్కునేవీ.. వెంట్రుకలు పీకేవీ.. ఇవన్నీ మన పల్లె జనాలకు మీ డాక్రా మహిళలే అందించి పుణ్యం కట్టుకోవాలె! వాళ్ళను కాపాడాలె!"

లలిత, భాగ్యలక్ష్మి అందరూ సామాన్ల బుట్టలన్నీ వూడబీకారు. ఒంటికి పూసుకునే రకరకాల క్రీములు... గోళ్ళు కత్తిరించేవీ... వీటితోబాటే పళ్ళబ్రషు.. కంటికాటుక...

"వినండి.. మీకు 'డాక్రా సూపర్ బజార్లు'.. సరుకులలో నింపి పారేస్తాం! మీరు చేయాల్సిందల్లా దర్జాగ కాల్మీద కాలేసుకుని టకటక సరుకులమ్మి పారేయడవే! అబ్బో... అటు కొనేవాడికి కారు చవక... ఇటు మీకు అత్యధిక లాభం... లాభాలే లాభాలు.. కారుచవకే కారు చకవ...!"

వాడు చెప్పుకు పోతూనే వున్నాడు - రాధకు అక్కడే పెనుభూతంలాంటి ఓ అనుమానం తన్నుకు వచ్చింది- ''సరే నంబడం.. నాకన్సలు అర్థంగానిదేంటంటే... సరుకులు కొనే వాడికి చవకైనప్పుడు... అమ్మేవాడికి అధిక లాభం ఎట్లా వుంటుందీ.. ఏమో... నాకేం నమ్మబుద్ధి కావడం లేదు - ఎక్కువధరా... ఎక్కువ లాభం.. అది కరక్టు గదా!"

కార్స్ ప్రతినిధి చాలా జాలిగా చూశాడు.

"అదే డాక్రాదాబు... మన చంద్రబాబుగారు మీరంతా మీ కాళ్ళమీద మీరే నిలబడాలనే ఈ ఏర్పాటు చేస్తే! ఈ సరుకులన్నీ టోకున మలేషియా, సింగపూర్, జపాన్, జకార్తాల నుండి ఇంటర్నెట్ పెట్టి ఇండియాకు తెప్పించాడు - అబ్బో.. అంతా అందులో లాభమే. డైరక్టు... స్వయం ఉపాధి పథకాల కింద ఈ అమ్మకం..!"

వాడు చెప్పుకు పోతూనే వున్నాడు - కరకరలాడే... పిసపిసలాడే ఎన్నో రకాల బిస్కట్లు... క్రీములు.. జామ్‌లు.. సెంట్లు.. పిజ్జారొట్టెలు... అన్నీ ఘుమఘుమలాడి పోతున్నాయి-

"చూశారా... మీరు చేయాల్సిందల్లా వాటిని అమ్మి అధిక లాభాలు సంపాదించి మీకాళ్ళమీద మీరు నిలబడడవే! అసలు మీకో పెద్ద రహస్యం.. చెప్పాలి?" కార్స్ వాడు అట్లా అనడంతో అందరూ చెవులు దొప్పల్లా రిక్కించి ముందుకు వంగారు.

"ఈ సూపర్‌బజార్లు ప్రారంభమై అట్లా నడక మొదలు పెట్టి.. మీరు లాభాలు అందుకునేంతలోనే మీ సూపర్ బజార్లలోకి కలర్ టీవీలు.. కూలర్లు.. మిక్సీలు.. కెమెరాలు.. విసీడీలు.. అసలు ఈ పల్లెసీమలు పసుపు బంగారమై పేద ప్రజలందరికీ మోటారు సైకిళ్ళు అందుబాటులోకి వచ్చి వాళ్ళంతా స్వర్ణాంధ్రలో స్వర్గలోకపు రుచులూ... జీవితం గడపడానికే ఇన్ని ఏర్పాట్లు!" వాడు చెమట తుడుచుకుని ఆయాసం తీర్చుకుని కూలబడ్డాడు. అపుడు డాక్రా మహిళల గుంపులో రకరకాల అనుమానాలు బయలుదేరినై!

డాక్రా బజార్లలో మన డాక్రా గుంపులు తయారు చేసే విస్తళ్ళు... చాక్‌పీసులు... పచ్చళ్ళు... బొమ్మలు.. వెన్న... నెయ్యి మొదలైనవి అమ్మకాలకు పెడతాం అన్నారు-అబ్బ... మరి బాబుగారేమో ఏకంగా పెద్దరకం బిజినెస్సే తమకప్పజెప్పారు.. హమ్మయ్యా! ఈ సరుకులతో అద్భుతంగా లాభాలు సంపాదించి హాయిగా బతకొచ్చు... "నా మొగుడు తాగొచ్చి ఇంక నన్ను పిడిగుద్దులు గుద్దితే వూర్కునేది లేదు" అని రాధ మహా సంబరపడిపోయింది.

"మామూలు దుకాణాల్లాగ్నే పొద్దునే తెరిచి రాత్రి దాకా అందరం అమ్ముకుంటూ కూర్చోవాలన్నమాట! మరో చిన్నడౌటు... బయట దుకాణాలల్ల కూడా గివి అమ్ముతారు గద!"

"అద్దదీ.. తూనికల కొలతల కచ్చితమైన పరిజ్ఞానం మీకు కలుగజేయబడుతుంది. వస్తువు నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడేది లేదు - మీరు చాలా నిక్కచ్చి కచ్చితమైన సరుకులూ అందిస్తారన్నమాట! మరో విషయం..." వాడు గొంతు బాగా తగ్గించి గూఢచారి ఫోజులో 'వీటిల్లో ఎంత మాత్రం కల్తీ అన్నమాట అస్సలుండదు - అన్నీ ఫారిన్ మేకింగ్.. ఇండియన్ ప్యాకింగ్... అదీ... అట్లా మన సూపర్ సరుకులు మన "ఊరి" పల్లె జనాలకు చేరతాయి. ఇటు మీ కాళ్ళు మీదగ్గర్నెవుండె!" వాడు అందరి కాళ్ళవంకా పరిశీలనగా పోలీసు కుక్కలా చూశాడు.

"అబ్బో... ఇన్ని రకాల సరుకులకు పెట్టుబడో...?"

"అదే చెప్పేది.. మా అందరికీ ఒరోరకం సరుకు.. అయిటమ్ ఒక్కో పాకీటు చొప్పున అందిస్తాం... మీరు వాటన్నిటినీ మన 'సంచార సూపర్ డాక్రా బజార్' ద్వారా అమ్మేస్తారు వెరీసింపుల్...!"

''నంచారం ఏందీ...?'' వనజ అనుమానంగా అడిగింది.

"చూడమ్మా.. మన జనం బాగా పనుల ఒత్తిడిలో వుంటారు.. 'ప్రజల వద్దకు పాలన' సరుకులు కొనే తీరిక మనవారికెక్కడిదీ.. అందుకే ఎంచక్కా వీటిని ఓ మాంచి బుట్టలోనో, తట్టలోనో పెట్టుకుని వీధివీధీ... మరీ ముఖ్యంగా బంజారా తండాలు.. కోయకొమ్ముగూడాలు... తిరిగి అమ్ముతారు.. మీకాళ్ళ మీద మీరే నిలబడాలిగా...?" ఆ సరుకులట్లా అయిపోగానే మన సూపర్ బజార్నుండి తిరిగీ కొంటారు - అట్లాకొన్నవన్నీ అమ్మి... లాభాలు... మీ కాళ్ళు...

వాళ్ళందరికీ బుర్రలు తిరిగిపోయాయి. మూర్ఛవచ్చినంత పనయింది.

"మీరు మహిళలు... మీకు పట్టుదలా... ధైర్యం... నిజాయితీ.. ఎక్కువ! అందులోనూ మీ ఆడవాళ్ళు నోరు తెరిచి తియ్యగా అడిగితే 'కొననూ' అనే మగాడు ఎవడుంటాడు - మంచి రసకందాయంగా కూడా మీరు మాట్లాడతారు గదా!"

వనజ, రంగమ్మలు అప్పటికే మూర్ఛపోయారు!

"మీదిక్కుమాలిన ప్లాను బాగానే వుంది - కాళ్ళమీద నిలబడడం అంటే కాళ్ళరిగేలా తిరగడమా? సాలు సంబడం.. అయినా గీ పనికి మాలిన వస్తువులు కొంటానికి జనాలకు పనీపాటలేదు.. పంటల్లేవు.. నీళ్ళులేవు.. పైసలసలే లేవు....చాలు చాల్లేవయ్యా సంబడం...!" ◆

భామనే...

లక్ష్మి

పెళ్ళయిన కొత్త రోజుల్లో కొత్త దంపతులకు ఆషాడమాసం టెంపరరీ వియోగం! ఆమె మాటేమోగానీ అతను ఆ ఎడబాటు సహించలేడు. అద్దెకొంపలో ఒంటరిగా వుండలేడు. కన్నుమూసినా, తెరిచినా ఆమె దివ్యరూపం కళ్ళెదుటే వుంటుంది. అద్దంలో తన మొహానికి బదులు ఆమె మొహమే కనిపిస్తుంది. పరుపూ దిండూ దుప్పటీ సమస్తం ఆమె రూపంలోనే వుంటాయి. అత్తవారింటో ఆమె ఎట్లా వుందోనని బెంగపెట్టుకుంటాడు. ఒకసారి చూసిరావాలనుకుంటాడు. ఆమెను చూసేందుకు చొరవగా అత్తవారింటికి వెళ్ళినా - ఆషాడమాసం గనక రానివ్వరు! అంచేత అతను ఒక చీకటి రాత్రి అత్తవారింటికి వెళ్ళి గోడదూకుతాడు. కుక్క మొరుగుతుంది. దొంగెవడో వచ్చేడని ఇంటివాళ్ళతో పాటు ఇరుగుపొరుగు అతన్ని పట్టుకుంటారు. లైటు వేస్తారు. ఆ వెలుగులో అల్లుడ్ని చూచి అతని మామగారు షాకుతింటారు. రాత్రిపూట గోడదూకడమేమిటయ్యా బొత్తిగా అని అమాయకంగా అడుగుతాడు. సిగ్గులేకుండా సిగ్గుపడకుండా ఎంతో ధీమాగా - అయ్‌వాంట్ మై వైఫ్ అంటాడు. ఇది ఆషాడమాసం నాయనా అని అత్తగారు గుర్తు చేస్తుంది! అయ్‌డోంట్ కేర్ ఆషాడమాసం అని అరుస్తాడు!

ఆ మాటకి అందరూ ముక్కుల మీద వేళ్ళేసుకుంటారు. ఆ భంగిమ చూచి, ఆవేశం తగ్గించుకుని - ఈ ఆషాడమాసం ఎన్ని నెలలుంటుందని దిగులుగా అడుగుతాడు. మాసమంటే మంత్ బావగారూ! మంతంటే నెలన్న మాట! ఆషాడమాసం నెలరోజులుంటుంది అని లెక్క వివరిస్తుంది చిట్టి మరదలు. అయ్‌సీ! ఆషాడమాసమంటే ఎండాకాలం వర్షాకాలం సీతాకాలం మాదిరి - ఒక సీజననుకున్నాను! నెలరోజులేనా అని బావగారు నీళ్లు నముల్తాడు. నెలరోజులని ముందరే తెలుస్తే తొందరపడి గోడదూకేవాడిని కాదని నిజం కూడా చెబ్తాడు. అతనేం చెప్పినా అత్తమామలు వినిపించుకోరు. అమ్మాయి పట్ల అల్లుడిగారికి అంతలావు ప్రేమ వున్నందుకు ఆనందిస్తారు. అమ్మాయిని చూసేందుకు గోడదూకిన అల్లుడుగారు - అమ్మాయికోసం ఏమైనా చేయగల హీరో అని ముచ్చట పడతారు. అంతేగాని - పెళ్లయిన కొత్త రోజుల్లో ప్రతి అల్లుడూ తన భార్యకోసం గోడలు దూకేందుకు రెడీగా వుంటాడనీ, రానురాను ఆ సాహసానికి ఓపిక సన్నగిల్లి పోతుందని గమనించరు! బతికినంత కాలమూ భర్తకోసం సాహసాలు చేయడం, త్యాగాలు చేయడం ఆడవాళ్లకే చెల్లుతుంది!

ఆ మాటకొస్తే ఆడవాళ్ల దయవల్లే మగవాడు మహావీరుడనీ, ధీరుడనీ బిరుదులు కొట్టేసిన సందర్భాలు ఒక్కనేల మీదే కాదు - పురాణాల్లో కూడా వున్నాయి! మాయకు మారుపేరు లార్డ్ కృష్ణ! నరకాసురుడి నడ్డి విరగ్గొడతానని పంతం పట్టేడు! ఆ ముచ్చటేదో చూద్దామని నరకాసురుడు యుద్ధానికి సిద్ధమని దండోరా వేయించేడు. వాడి పవరేమిటో తెలుసుకున్న పరమాత్మ ఖంగుతిన్నాడు. వాడ్ని చంపుతానని పంతం పట్టిన మాట నిజమేగాని - అది నాతరమా అని తల్లడిల్లి పోయేడు. తల్లడిల్లి పోతున్నాను గనక ఇదిగో తెల్లజెండా అని రాజీ పడితే - ఇంటా బయటా తన పరువు పరమ చీపుగా పోతుంది. ఈ దుస్థితి నుంచి తప్పుకునే తరుణోపాయం ఏమిటాని కొన్ని రాత్రిళ్లూ పగళ్లూ ఏకదీక్షగా ఆలోచన చేసేడు. ఎట్టి పరిస్థితుల్లోనూ నరకాసుర వధ తన వల్లకాదని తెలిసిపోయింది! ఆ కార్యమేదో కారణజన్మురాలు సత్యభామ చేతులమీదుగానే జరగవలసి వుందని స్వామికి భవిష్యద్దర్శనమైంది! అంతమాత్రాన ఈ రహస్యం సత్యభామకి చెబితే - తన అడ్రస్సుకి విలువే వుండదని గ్రహించేడు. ఆ స్థితిలో అట్నుంచి నరుక్కొచ్చి - నేను కూడా నీతోపాటు యుద్ధానికి వస్తాను స్వామీ అని సాక్షాత్తు సత్యభామ చేతనే అడిగించుకున్నాడు. అలాగలాగే అంటే భార్యకి అలుసైపోతాననే భయంతో - ఆడవాళ్లు యుద్ధాలకు సూటుకారు గనక, ఇంటోకూచుని ముగ్గులేసుకోమని పద్యాల్తో

మందలించేడు. ఆమె వినిపించుకోదని బాగా తెలిసి కూడా భావయుక్తంగా, రాగయుక్తంగా పాడిన పద్యాలే మళ్లీ మళ్లీ పాడేడు!

చివరికి - యుద్ధమంటే బంతులాట కాదని వచనంలో హేళన చేసేడు! ప్రాణాల్తో పని అని భయపెట్టేడు! భర్త నటన తెలీని అమాయకపు ఇల్లాలు గనక - అతను నూరిపోసే పిరికి మందుని అవతలకు నెట్టేసి - యుద్ధానికి నేను సిద్ధమని తెగేసి చెప్పింది సత్య! ఆరునూరైనా నూరు ఆరైనా మీ రథంలో నేను వుంటానని డిక్లేర్ చేసింది ఆ భామ! శ్రీకృష్ణుడికి కావాల్సింది కూడా అదే! ఎంతైనా మాయల మగాడు గనక తనక్కావల్సిందేమిటో ఆవిడ చేత అడిగించుకుని - అద్భుతమైన వరమేదో యిస్తున్న బాణీలో - ఓకే! అలాగే సత్యా అన్నాడు! నీ ముచ్చట తీర్చడమే నా ధ్యేయమని హుందాగా చెప్పేడు! ఆ పిచ్చితల్లి కృష్ణమాయలో పడిపోయింది. భర్తతో పాటు యుద్ధరంగంలో అడుగుపెట్టింది. భర్తగారు నరకాసురుడి బాణం దెబ్బకి బాబో అంటో కళ్లు తిరిగిపడిపోయేడు! అప్పుడు సత్యాదేవి ఆయుధాలు ధరించి రణరంగంలో విజృంభించింది. అంతపెద్ద నరకాసురుడ్ని నేలకూల్చింది! అప్పుడు కూడా అదంతా భర్తగారి అనుగ్రహమే అనుకుందిగానీ - తన సొంత శక్తి సామర్థ్యాలు ఏ పాటివో తెలుసుకోలేక పోయింది!

అలనాటి సత్యభామకు ఏ మాత్రం తీసిపోని మహిళామణులు ఈనాటికీ వున్నారు. పిరికివారు, బలహీనులు, అల్ప ప్రాణులు అనే బిరుదులు అనేకం భరిస్తూ - సమయం ఆసన్నమైనప్పుడు మగమారాజులను ఆదుకుంటున్నారు. ముంచుకు వచ్చిన ముప్పు నుంచి ఆ మగధీరులను రక్షించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆడ సలహాలు మాకు అవసరం లేదని మగవాళ్ళు మారాం చేస్తూనే వున్నారు. మారాం చేస్తూనే - కాకరకాయవేపుడు ఆరోగ్యానికి ఏ విధంగా మంచిదో ఆడవారినే అడిగి తెలుసుకుంటున్నారు. ఇష్టం లేకపోయినా కాకరకాయ వేపుడే కావాలంటున్నారు! తలంటు ప్రయోజనాలు ఆడవారు చెబుతుంటే శ్రద్ధగా వింటున్నారు. కష్టంగా వున్నా వారానికో రోజు కుంకుడు రసం - తలంటు పేరిట కళ్లల్లో పోసుకుంటున్నారు. సూర్యనమస్కారాల అంతరార్థం, వాటి ఆవశ్యకత ఆడవారు చెబితేనే గాని అర్థం కాని స్థితిలో వుండి - సూర్యోదయం వేళకి తమని నిద్రలేపే డ్యూటీ కూడా ఆడవారికే అంటగడుతున్నారు. ఒక పక్క ఆడవారి సలహా సంప్రదింపులతో తమ మెదడు పదును చేసుకుంటూనే - మరో పక్క ఆడ సలహాలను పాటించే దిక్కుమాలిన అలవాటు ఏడేడు తరాలుగా తాత తండ్రులకూ లేదు, తమకీ లేదని డాంబికాలు పలుకుతున్నారు! ఈ మాయదారి పరిస్థితికి పరిష్కార మార్గమేమిటి స్వామీ అని ఆ మాయ కిష్టుడ్ని ఆడవారు ప్రార్థించి ప్రయోజనం ఏమిటి? సదరు కిష్టుడు కూడా ఆడవారి సాయంతోనే ఆడంబరంగా వెలిగిన మగమారాజే కదా? అందువల్ల ఏంచెబ్తాడు సమాధానం - చిద్విలాసంగా నవ్వడం తప్ప! ◆

చూడ చక్కని శిల్పాల ఖజురహో

శిరీష

మధ్యప్రదేశ్‌లోని ఖజురహో ఆలయాలు ప్రపంచానికి ఓ అద్భుత బహుమతి. వెయ్యేళ్ళ క్రితం ఉత్తర మధ్య భారతదేశాన్ని పాలించిన చందేల రాజుల పోషణలో ఈ ఆలయాలను ఖజురహో అనే చిన్న గ్రామం సమీపంలో. క్రీ.శ. 950-1050 మధ్య కాలంలో నిర్మించారు. గ్రానైట్, ఇసుక రాయితో నిర్మించిన 85 ఖజురహో ఆలయాలు అద్భుత శిల్ప సంపద, వాస్తు సంపదల మేలు కలయికగా ఉన్నాయి. ఆలయ ప్రధాన కట్టడం చక్కగా నిలిచి ఉండేందుకు వీలుగా నిట్టనిలువుగా అనేక శిల్పాలు ఒక దానిపై ఒకటి పేర్చి ఉంటాయి. వీటిని మహాశిల్పులు గొప్ప రసహృదయంతో అద్భుతంగా మలిచారు. వారి మధురమైన అనుభూతులు, అందం పట్ల వారికి గల ప్రేమ వీటిలో ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతం దేశంలోని అనేక ప్రాంతాలలోని అద్భుత శిల్పాలయాలు శిధిలమైపోతున్న తరుణంలో ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించబడిన ఖజురహో ఆలయాలు కూడా శిధిలమవుతున్నాయి. ప్రభుత్వ అలసత్వానికి, నిర్లక్ష్యానికి తార్కాణంగా నేడు అనేక అద్భుత కట్టడాలు శిధిలాలుగా మారిపోతున్నాయంటే మనం ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు.

ఖజురహో శిల్పాలు చాలా వరకూ నగ్నంగా ఉంటాయి. అయితే శిల్పాలు మాత్రం ఎంతో అద్భుతంగా చెక్కబడటంతో దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వస్తూ ఉంటారు. ఖజురహో చుట్టుపక్కల అనేక ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలుండటంతో ఇది చక్కటి సందర్శనా స్థలంగా ఉంది. మూరు మూలన ఉండే ఈ గ్రామం మూర్చి మొదటి వారంలో అంగరంగ వైభవంగా, శోభాయమానంగా ఉంటుంది. శివరాత్రి సందర్భంగా అక్కడ జరిగే నృత్యోత్సవాల్లో అవకాశం రావడాన్ని నర్తక, నర్తకీమణులు మహద్భాగ్యంగా భావిస్తారు. ఇక్కడ జరిగే నృత్య ప్రదర్శనల వేదికకు వెనుక ఉండే చక్కటి పరదావలె ఈ ఆలయాలు అమరి ఉంటాయి.

ఇక్కడ ఆలయాల గోడలపై శృంగార క్రీడకు సన్నద్ధమవుతున్న స్త్రీ, పురుషులు, వియోగ భారంతో ఉన్నవారు, ఎడబాటు కలుగుతుందనే కలతతో ఉన్న వారి శిల్పాలున్నాయి. ఖజురహోలో చెక్కిన స్త్రీల శిల్పాలు దేశంలోని ఇతర ఆలయాలలోని శిల్పాలకు భిన్నంగా ఏమీ ఉండవు. అయితే ఖజురహోలోని స్త్రీమూర్తులలో అద్భుత అందాలు, కళాత్మకత కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది.



వాస్తవానికి అక్కడ 85 ఆలయాలు ఉండగా ప్రస్తుతం 20 ఆలయాలు మాత్రమే నిలిచి ఉన్నాయి. లక్ష్మణ ఆలయం (క్రీ.శ.950), విశ్వనాథ ఆలయం (క్రీ.శ. 1002), అన్నింటిలోకి అత్యద్భుతమైన చిత్రగుప్త ఆలయం, శివునికి అంకితమిచ్చిన కందరియా మహాదేవ ఆలయం (1025-50)తో సహా ఉన్న ఆలయం సముదాయాన్ని పశ్చిమ సముదాయంగా చెబుతారు.



ఖజురహోలోని ఆలయాలన్నింటిలోకి అతి పెద్ద ఆలయం ఈ కందరియా మహాదేవ ఆలయం. ఈ ఆలయం కుడ్యాలపై వివిధ వాద్య పరికరాలను వాయిస్తున్న కళాకారులు, గాఢాలింగనంలో ఉన్న ప్రేమికులు, అతిపెద్ద మొసలి, రెక్కలతో ఉన్న దేవీదేవతా విగ్రహాలు ఉన్నాయి. ఇది మౌంట్ కైలాస్‌లోని ఆలయాన్ని పోలి ఉంటుంది.

కందరియా మహాదేవ ఆలయానికి దక్షిణాన చౌసట్ యోగిని ఆలయం (64 మంది యోగినులు) ఉంది. ఈ ఆలయాన్ని కాళీమాత ఆలయంగా నిర్మించారు. అయితే ఆ ఆలయంలో ఇప్పుడు కాళీ మాత విగ్రహం లేదు. పూర్తిగా గ్రానైట్‌తో నిర్మించిన ఆ విగ్రహం ఇప్పుడు నామ రూపాలు లేకుండా పోయింది. కానీ స్థానిక ప్రజలు ఎక్కువ భక్తితో వెళ్ళే మాతానేశ్వర ఆలయాన్ని విష్ణుమూర్తికి అంకితమిచ్చారు. అయితే ఇక్కడ గర్భగుడిలో 2.5మీటర్ల లింగం వుంది. ఆలయం ముంగిట ఉన్న చిన్న ఆలయంలో వరాహావతారంలో ఉన్న విష్ణుమూర్తి ఉంటాడు.

తూర్పువైపున బ్రహ్మావామన, జావారీ ఆలయాలు ఉంటాయి. అదినాథ, పార్శ్వనాథుల జైన ఆలయాలు వుంటాయి. ఖజురహో లోని అతిపెద్ద, చక్కటి ఆలయంగా పార్శ్వనాథుని ఆలయం వుంటుంది. గ్రామానికి ఆగ్నేయాన ఉన్న ఘంటాడి ఆలయం చాలా ఆసక్తిదాయకంగా వుంటుంది. ఆలయ స్తంభాలపై ఉన్న గంటలు, గొలుసుల ఆధారంగా దానికి ఆపేరు వచ్చింది. ఐదు కిలోమీటర్ల దూరాన దక్షిణాన వున్న సముదాయంలో రెండు ఆలయాలుంటాయి. ఇక్కడ దుల్హాదేవ ఆలయాన్ని శివునికి అంకితమిచ్చాడు. చతుర్భుజాలయంలో విష్ణుమూర్తి ఉంటాడు. ఖజురహోలోని పురావస్తు శాఖ వారి మ్యూజియంలో మనకు అనేక బౌద్ధ, జైన శిల్పాలు కనిపిస్తాయి.

ఈ ఆలయన సముదాయం వారం రోజూలూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ తెరచి వుంటుంది. 12 ఏళ్ళ పైబడిన వారందరికీ ప్రవేశ రుసుం ఐదు రూపాయలు. శుక్రవారం రోజు ఉచితంగానే వెళ్ళవచ్చును. ఈ ఆలయాలను సందర్శించేందుకు చక్కటి సమయం అక్టోబర్ నుంచి ఏప్రిల్. ఢిల్లీ, ఆగ్రా, వారణాసి సమీపంలోని విమానాశ్రయాలు. హర్పాల్‌పూర్, మహోబా, ఝాన్సీ సమీపంలోని రైల్వే స్టేషన్లు. సత్నా, హర్పాల్‌పూర్, ఝాన్సీ (175 కి.మీ.), గ్వాలియర్ (280 కి.మీ.) నుంచి రోడ్డు సదుపాయం వుంది. ఇక్కడ విడిది చేసేందుకు మధ్యప్రదేశ్ టూరిజం శాఖ హోటళ్ళు, అనేక ప్రైవేట్ హోటళ్ళు వున్నాయి. ఖజురహోకు చుట్టు పక్కల ఇంకా అనేక దర్శనీయ స్థలాలు వున్నాయి. ◆

ప్రతిభ ఉన్నా... ప్రోత్సాహం సున్నా...

ఎం.రామకృష్ణ

జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో విజయ కేతనం ఎగురవేస్తూ రాష్ట్రంతో పాటు దేశానికి వన్నె తెస్తున్న ఎంతో మంది అంతర్జాతీయ క్రీడాకారులకు వారి ప్రతిభకు తగిన ఉద్యోగావకాశాలు లేక ఆవేదన పడుతున్నారు. ఖరీదైన క్రీడగా పేరుగాంచిన బ్యాడ్మింటన్‌లో కష్టనష్టాల కోర్చి పసిడి పతకాల పంట పండిస్తూ పలువురు క్రీడాకారులు రాష్ట్ర కీర్తిని దశదిశలా వ్యాపింపచేశారు. బ్యాడ్మింటన్‌లో పుల్లెల గోపిచంద్, చేతన్ ఆనంద్ వంటి క్రీడాకారులేకాక రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న శ్వేత, పృధ్వి, సునీల్, శ్రీలక్ష్మిలు విజయపరంపర కొనసాగిస్తున్నారు. ఇటీవల జరిగిన జాతీయ క్రీడలలో ఈ క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలన్నింటినీ కైవసం చేసుకుని యావత్ దేశాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇటువంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని కేంద్రం ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడల బడ్జెట్‌ను కూడా కేంద్రం నామమాత్రంగా కేటాయించడంతో పాటు, అన్ని క్రీడలకు ఒకే విధమైన ప్రాముఖ్యత ఇవ్వడంపై క్రీడా సంఘాలలో కూడా నిరాశ చోటు చేసుకుంది. గత ఏడాది వరకు బ్యాడ్మింటన్ క్రీడాకారులకు పెట్రోలియం స్పోర్ట్స్ బోర్డు ఉద్యోగావకాశాలు కల్పించింది. అయితే తమ వద్ద సరిపడా క్రీడా జట్టు ఉండే సరికి రిక్రూట్‌మెంట్ నిలిపి వేసింది. దీంతో బ్యాడింటన్ క్రీడాకారులు ఉద్యోగావకాశాల కోసం వేట ప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల గుంటూరులోని ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో బంగారు పతకాలు సాధించిన ఆటగాళ్ళతో ప్రజాశక్తి చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ....

కేంద్రప్రభుత్వ ప్రోత్సాహం లేదు: పి.సునీల్

క్రీడలకు కేంద్రప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహం ఇవ్వడం లేదని, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని కేంద్రం ఇవ్వడంలేదని బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారుడు పి.సునీల్ అన్నాడు. ఉద్యోగ కల్పన విషయంలో పిఎస్‌సిబి మినహా మరే సంస్థ ఆసక్తికనబర్చడం లేదన్నారు. కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సునీల్ 2000 సంవత్సరంలో చైనాలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో పాల్గొన్నాడు. 2001 సంవత్సరంలో డచ్, జర్మనీ ఓపెన్‌లో కూడా ప్రవేశించాడు. 2001 పంజాబ్ నేషనల్స్‌లో మరో అంతర్జాతీయ క్రీడాకారుడు పృధ్వితో కలిసి డబుల్స్‌లో ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నాడు. గుంటూరులో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో విజయభేరీ మోగించాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 32వ నేషనల్ గేమ్స్‌లో ఒక స్వర్ణం, ఒక కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు. అయితే విదేశాలతో పోలిస్తే అక్కడ క్రీడాకారులు నిరంతరం ఏదో ఒక టోర్నమెంటులో పాల్గొంటారని, ఆ విధంగా ఎక్కువ టోర్నమెంట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుతం అకాడమీలో లభిస్తున్న శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎక్కువ టోర్నమెంట్లు జరగాలి: బి.శ్రీలక్ష్మి

దేశీయంగా ఎక్కువ టోర్నమెంట్లు జరిగితే వాటిలో నిరంతరం పాల్గొనడం వల్ల అంతర్జాతీయంగా ఆశించిన ఫలితాలు వస్తాయని అంతర్జాతీయ క్రీడాకారిణి బి.శ్రీలక్ష్మి చెబుతోంది. బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న శ్రీలక్ష్మి ఇంజనీరింగ్ చదువుతోంది. 2000లో సంవత్సరం మలేషియాలో జరిగిన ఏషియన్ స్కూల్ గేమ్స్‌లో ఆమె పాల్గొంది. 1997వ సంవత్సరంలో అస్సాంలో జరిగిన మినీడబుల్స్‌లో రన్నర్‌గా నిలిచింది. ఇటీవల గుంటూరులో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీలో చక్కటి ప్రతిభను ప్రదర్శించింది. ప్రైజ్ మనీ టోర్నమెంట్లు ఎక్కువగా జరిగితే క్రీడాకారులకు ప్రోత్సాహంగా ఉంటుందని చెప్పింది.

కోచ్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం నిల్: పి.యు.భాస్కర్‌బాబు

కేంద్రం ఎలాగూ పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు చక్కటి ప్రోత్సాహం ఇస్తోంది. కానీ వారిని తయారు చేస్తున్న కోచ్‌లను విస్మరిస్తోందని విజయవాడ బ్యాడ్మింటన్ అకాడమీ సాయ్ కోచ్ పి.యు.భాస్కర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తగ్గ విధంగా క్రీడాకారులను తయారు చేయాలంటే కోచ్ నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆవిధంగా క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇస్తేనే క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అందుకు నిదర్శనమే ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయక్రీడలలో తమ అకాడమీ క్రీడాకారులు ఆరు బంగారు పతకాలతోపాటు రజత, కాంస్య పతకాలను కూడా కైవసం చేసుకున్నారని అన్నారు. నామమాత్రంగా కోచ్‌ల కన్నీళ్లను తుడవటం సరికాదని చెప్పారు. క్రీడ ప్రాధాన్యత, ఆ క్రీడలో వస్తున్న ఫలితాల ఆధారంగా కోచ్‌లను కూడా ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా ఉన్న కోర్టులలో ప్రాక్టీస్ చేసి విదేశాలలో ఉన్న కోర్టులలో ఆడాలంటే క్రీడాకారులు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. బ్యాడ్మింటన్‌లో భారతదేశం మంచి స్థానంలోనే ఉందని చెప్పారు. అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో ప్రధానంగా భారతదేశానికి చైనా, ఇండోనేషియా, జపాన్, జర్మనీల నుండి గట్టి పోటీ ఉంటుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రస్తుతం దేశంలో ఉన్న బ్యాడ్మింటన్ కోర్టులను మార్పులు చేస్తే ఈ పోటీని తట్టుకోవడం సాధ్యమేనని అభిప్రాయపడ్డారు.

ఉద్యోగావకాశాలు ఆశించిన విధంగా లేవు: డి.శ్వేత

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులకు సైతం ఆశించిన విధంగా ఉద్యోగావకాశాలు లేకపోవడం విచారకరమని ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి డి.శ్వేత అభిప్రాయపడింది. ఎం.బి.ఏ పూర్తి చేసి విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో ఎం.ఏ చదువుతున్న ఈ క్రీడాకారిణి 2002, మార్చిలో నెదర్లాండ్‌లో జరిగిన థామస్, ఉబర్ కప్ టోర్నీలలో పాల్గొంది. 1997, 98 సంవత్సరంలో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన జూనియర్ ఏషియన్ బ్యాడ్మింటన్‌లో రన్నర్‌గా, జూనియర్ నేషనల్ సింగిల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. 2001 పంజాబ్ నేషనల్స్‌లో రజితం, 2002 ఏపి నేషనల్స్‌లో కాంస్యాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది ముంబయిలో జరిగిన అఖిల భారత సీనియర్ బ్యాడ్మింటన్‌లో కూడా చక్కటి ప్రతిభను కనబర్చింది. 2000 వ సంవత్సరంలో గాయంతో కొంత కాలం తెరమరుగైనప్పటికీ అనంతరం కోలుకుని పట్టువదలక విజయపథంలో దూసుకుపోయింది. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు తమ ప్రాక్టీస్‌కు చక్కగా ఉపయోగపడుతున్నాయని అయితే వాటిని మరింత పెంచితే ఫలితాలు కూడా ఎక్కువగా వస్తాయన్నారు.



దర్శన్

"ఒరేయ్ మోహన్! నువ్వూ యాదగిరి కలిసి నారాయణగిరికి పోవాలె" బుద్ధిమంతులైన తన విద్యార్థులిద్దర్ని తరగతి గది వెలుపలికి పిలిచి చెప్పాడు ఆ బడిపంతులు యాకుబ్. మోహన్ మూడో తరగతి, యాదగిరి రెండో తరగతి చదువుతున్నారు. ఒక పొరుగూరికి ఆ మధ్యాహ్నం దాటిన వేళ వెళ్ళి రావాలంటే ఆ పసివాళ్ళకు కష్టంగానే తోచింది. అయినా టీచరు చెప్పిన మాట వినక తప్పదు.

నారాయణగిరి ఊరును ఆనుకునే 'ఏనె' ఉంది. ఏనె అంటే తెలుసుగారా. నల్లరాళ్ళదిబ్బ. ఆ ఏనె మీద కొన్ని గుడిసెలుంటాయి. ఆ గుడిసెల్ల కొత్త పెంకుటిల్లు ఉంటది. ఆ ఇల్లు మాదిగ బాలయ్యది. ఆదు కొడుకుని బడికి తోలిస్త అన్నాడు. తోలియ్యమని చెప్పాలె. అట్లనే పది రూపాయలిస్తడు. అవి జాగ్రత్తగా జేబుల దాసుకొని తీసుకు రావాలె. ఆ బాధ్యత నీదేరా మోహన్. ఏదీ ఇటురా నీ జేబుకు పొక్కలేమి లేవుగా" అంటూ అతడి నిక్కరు జేబుని, అంగి జేబుని చెక్ చేసి రంధ్రాలు లేవని నిర్ధారించుకున్నాడు.

'పొద్దు మూకుతల్లకు తిరిగొస్తమాసార్. పొద్దు మూకితే భయమేస్తది నాకు' అన్నాడు యాదగిరి.

'అప్పటిదాకా ఏం జేస్తరురా. తొవ్వొంటి ఆటలాడేరు. పిట్లపోయినట్లు పోవాలె. కుందేలు ఎట్ల ఉరుకుతది, అట్ల ఉరుకాలె. అగో ఆ పెద్ద పలుగు కనబడ్తుందా. ఆ పలుగు ఎక్కితే ఈవల ఈ ఊరు ఆవల ఆ ఊరు కన్పిస్తుంటాయిగా. ఇప్పుడు మూడు గంటలైంది. అర్థగంటల పోయి, అర్థగంటల రావొచ్చు. నాలుగ్గంటలకల్లా నక్కాలు మూయకముందే రావాల'అన్నాడు ఆ పంతులు. అట్లనే సారు అంటూ ఆల్లిద్దరూ పరుగు అందుకున్నారు.

ఆలస్యంగా ఇంటికి వెళ్ళిన మోహన్ని వాళ్ళమ్మ 'బడి ఎప్పుడో ఇడిసి పెడితే ఇప్పటిదాకా ఏడికెళ్ళావురా' అంది.

"మా సారు నారాయణగిరికి తోలిచ్చిండు. ఆడ బాలయ్య కొడుకుని స్కూలుకు తోలమని చెప్పి రమ్మన్నాడు"

"పసివాడ్ని అంతదూరం ఎట్ల పంపించిండు మీసారు. సెలుకల్ల నీకు భయమైతే. 'అదీ వేరే ఊరికి నిన్ను పంపుతడా. మీసారుని అడుగత' అందామె.

"ఒద్దే. అమ్మా. గురువులు సెప్పిన పనులు శెయ్యాల్నంట. మా తెలుగు పాఠంల రాసి ఉంది. తల్లి, తండ్రీ, గురువు దైవంతో సమానమని. నవ్వు అడిగితే మాసారు నన్ను మంచోడు కాదనుకుంటాడు"

* * *

ఆ రోజు ఆదివారం. బడికి సెలవు. మోహన్ బాయి కాడికి వెళ్ళాడు. తండ్రి పొలంలో అరకదుంతున్నాడు. రెండో అరక పోచయ్యది. పోచయ్యది మాదిగ కులం. మోట బొక్కెనకు తొండం కుట్టియ్యడం, చెప్పులు కుట్టియ్యడం అతడి వతను. అతడి తల్లి పొలంలో కూలోళ్ళతో నాటు వేయిస్తుంది.

పోచయ్య కొడుకు యాదయ్య. మోహన్ కన్నా ఏడాదిన్నర పెద్ద. వాళ్ళ ఊరు జూలూరు. పెద్ద ఊరు. అతడు కూడా బడికి వెళ్తాడు. జూలూరుది చాలా పెద్దబడి. ఇవ్వాల సెలవు కాబట్టి అయ్య వెంట వచ్చాడు. మోహన్ కన్నా అతడికెన్నో సంగతులు తెలుసు. వాళ్ళ బడిల పదిమంది టీచర్లు ఉంటరు. ఆ యాదయ్య తలకు కొబ్బరి నూనె రాసుకొని, దువ్వుకొని కాకి నిక్కరు, తెల్లని అంగీ తొడుక్కొని ఎంతో శుభ్రంగా వున్న అతడితో స్నేహమంటే మోహన్‌కు ఎంతో ఇష్టం.

ఆ రోజంతా అతడితో ముచ్చట్లే. అయినా యాదయ్య తన్ను తాకనిస్తలేడు.

"పటేలా కొంచెం దూరం కూసొని మాట్లాడు. మీరు మమ్మల్ని తాకరాదు"

'తాకితే ఏమయితది. ఎందుకు తాకరాదు"

"మేము అంటరానివాళ్ళం. మీరు కాపులు. మమ్మల్ని ఎవ్వరూ తాకరుగా"

"తాకితే ఏమయితది. నీ మురికి నాకేమన్నా అంటుతదా. ఈ మట్టెల సెయ్యి పెట్టిన, మట్టె అంటింది. దులుపుకుంటే పోతది. లేదా నీళ్ళల్ల శుభ్రంగా కడుక్కుంటాను. మరి నిన్నెందుకు తాకొద్దు. ఏమన్న అంటుతదా. నాది కూడా నీకు అంటుతదిగా"

"అయ్యా మీది సిన్న ఊరు. మీ ఊళ్ళ మా సిన్న జాతి లేదు. అందుకే నీకా విషయాలు తెల్వవు. మమ్మల్ని ముట్టుకుంటే మైలపడిపోతారు అని ఎవ్వరూ ముట్టుకోరు. నేను కూడా పిల్లగాడ్నే కాబట్టే ఇది ఎందుకొచ్చిందో నాక్కూడా తెలవదు."

"మైలపడిపోతరా. ఏదీ సూద్దాం" అంటూ మోహన్ తన చేతితో అతడి చేతిని తాకాడు. భుజమ్మీద నుంచి తన అరచేతిని వీపు మీది దాకా పోనిచ్చాడు. నాకు మైల ఏమీ అంటలేదే. ఉత్తిదే అన్నాడు. అతడి చేష్టకు యాదయ్య నివ్వెరపోయాడు. గొడవైపోతది బాబూ' అన్నాడు. పొలంలోంచి అయ్య పిలుపురాగానే యాదయ్య లేచి పరుగెత్తాడు.

పొలంలోంచి మోహన్ తల్లి వచ్చింది. 'ఇంటికి పోదాం రా. అన్నం తిందువు' అంటూ వెంట తీసుకెళ్ళింది. ముందు తల్లి. వెనుక తనయుడు. కాలిబాట వెంట నడుస్తున్నారు.

'అమ్మా! యాదయ్యను మనము ముట్టుకోకూడదా'

'కూడదు. ఆళ్ళు అంటరాని వాళ్ళు. ఎవ్వరూ ముట్టుకోరు. ఆళ్ళ ఇండ్లు కూడా ఊరి బయట ఉంటై'

'ముట్టుకుంటే ఏమయితది'

'ఆళ్ళు అంటరాని వారు అంటుకోకూడదు'

'అంటుకుంటే ఏమైతది'

'ఏమైతది ఏమోకాని స్నానం [illegible]

"ఎందుకు? యాదయ్య [illegible] ఉన్నాడు. నా శేతులకే మట్టి ఉంది. [illegible] ఎంత గలీజుగా ఉందో. [illegible] తొడుగుతున్నా. నేనొచ్చి [illegible] ఆయనకు అంటదిగా. [illegible]

[illegible] ప్రశ్నలు అడుగుతున్నాడు [illegible]

...నేమన్నా సదువుకున్నానా. యాదయ్యని తాకితే తాకినవుగాని మరెవ్వరితోను సెప్పకు. మీ నాయనకు కూడా. మీ నాయనకు తెలిస్తే యాదయ్యని ఒరిగెతో కొడ్తాడు' అందామె.

"అమ్మా! మరి నేనిప్పుడు స్నానం జేయాల్నా. సలి పెడ్తుందిగా!"

"స్నానం జేస్తందుకు ఇంటికాడ నీళ్ళు యాడ ఉన్నై. అక్కరలేదు. రెండు సుక్కలు సెంబుతో శిలుకరిస్తా. అప్పటిదాకా నన్ను ముట్టుకోకు"

"ముట్టుకుంటే నాది నీకు అంటుతదా. యాదయ్యది నాకు ఏమంటింది."

నన్ను ఒర్లియ్యకురా" అంటూ ఆమె విసుక్కుంది.

* * *

మోహన్ ఇప్పుడు నాల్గో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవలు.

'మోహన్ బడి బందేగా నాతో జూలూరుకు వస్తావా" అంది అతడి తల్లి.

"ఎందుకమ్మా?"

'మనూళ్ళ అందరు రైతులే. మనం పండించిన కూరగాయలు ఎవ్వరూ కొనరు. జూలూరుల అమ్ముకొస్తే ఓ ఆరేడు రూపాలొస్తయి. ఆ ఊళ్ళ అయితే సాకలి, మంగళి, కమ్మరి, కుమ్మరి, కోమట్లు, బ్రాహ్మండ్లు ఉంటారు. కూరలు కొంటారు' అందామె.

"నిరుడు ఒక్కసారి పోయిన జూలూరికి అదీ ఊరిబయట ఉన్న స్కూలుకి. ఊరంతా సూల్లేదు. వస్తానమ్మా"

తిరిగొచ్చే వరకు బాగా ఎండ ముదురుతుంది. ఆకలి వేస్తుంది. అందుకని ఆమె జొన్న రొట్టె తిన్నది. కొడుక్కి వేడి పాలు పోసి సద్దెన్నం పెట్టింది. ఆకుకూరలు, కాయగూరలు గంపలో సర్ది నెత్తిన ఎత్తుకొంది. కొడుకు వెంటరాగా ముప్పావు గంట నడిచాక జూలూరుకు చేరుకొనే సరికి ఉదయం ఎనిమిది అయింది.

ఊరి రెండో వీధిలో వడ్రంగి విశ్వనాథాచారి ఇల్లు ఉంది. ఇంకొంచెం ముందుకు కమ్మరి ఇల్లు ఉంది. వడ్రంగి ఇల్లు చాలా శుభ్రంగా ఉంది. నేలంతా నాపరాళ్ళతో పరిచి ఉంది. తలుపులు, దర్వాజాల మీద అందమైన బొమ్మలు చెక్కి ఉన్నాయి. అతడి కొడుకు జగన్నాథం మోహన్‌కు పరిచయమే. ఆ ఊరికి పరీక్ష రాయడానికి వెళ్ళినప్పుడు పరిచయమైంది. అతడి ఊరికి నాగళ్ళు చేయడానికి తండ్రి వెంట వచ్చిన అతడితో పరిచయం బలపడింది. అతడు మంచి శుభ్రమైన బట్టలు వేసుకున్నాడు. ఈ జగన్నాథం వాళ్ళు తమకన్నా బాగా బతుకుతున్నారు అనుకున్నాడు మోహన్. తనకు రెండు లాగులు, రెండు అంగీలు మాత్రమే ఉన్నాయి. ఒక జత ఇడువ, ఒక జత తొడుగ, అవి కూడా ముతకవి. ఇడిసింది ఉతుకడానికి తీసుకెళ్తారు. మూడు రోజులకు ఉతికి తెస్తారు. వేసుకున్న జత రెండో రోజుకల్లా మట్టి అయితది. అందుకని తాను ఎప్పుడూ మురికిగానే కన్పిస్తాడు.

విశ్వనాథం ఇంట్ల కూరలు తీసుకున్నారు. ఆ రైతు స్త్రీ మంచినీళ్ళు అడిగి తాగింది. తన కొడుక్కు తాగించింది. ఊరు పెద్దది. నీటికి కరువు. వీధిలోకొచ్చి 'కూరగాయలూ' అందామె. మంగళి ఇల్లు వచ్చింది. వాళ్ళు కూరగాయలు తీసుకున్నారు. ఆ తర్వాత చాకలి ఇల్లు. వాళ్ళు తీసుకున్నారు. ఈ వడ్రంగి, కమ్మరి, మంగలి, చాకలి వాళ్ళంతా ఈ కాపుకు వృత్తి పనివారలే. "తమ పటేలమ్మా, తమకు ఆసామి న్యాయమైన ధరకే ఇస్తది అని నమ్మకంతో బేరమ్మాడకుండా ఆమె చెప్పిన ధరకే కొన్నారు.

ఆమె అట్లా కూరలు అమ్ముకుంటూ కరణాల వీధిలోకొచ్చింది. పెరటి గోడలు కోటల్లాగా ఎత్తుగా ఉన్నాయి. రెండు ఆవరణల్లో రెండు బంగళాలు. పెద్ద గేట్లు, ఆ బంగళాలకు ఎదురుగ్గా పెద్దగా, విశాలంగా ఉన్న పెంకుటిల్లు. గేటు లోవల బంగళాలోంచి కూరలు కావాలని పిలుపు. ఆమె తన కొడుకుతో లోపలికి వెళ్ళింది. ఆ ఇల్లాలు ఎక్కువగానే కొన్నది. కాని బేరమాడింది. అన్నీ కలిపి రూపాయి చెప్పితే ఆమె పావలా తక్కువ ఇచ్చింది. తర్వాత రెండో బంగళాలో ఇదే తంతు. ఆ రెండు బంగళాలు అన్నదమ్ములవని' ఆ ఊరి దొరలని ఆమె తన కొడుకుతో చెప్పింది. ఎదురుగ్గా ఉన్న పెంకుటిళ్ళు కూడా కరణాలదేనట. ఒక ఇంటామె కాయగూరలు కొని లోనికి వెళ్ళింది డబ్బులు తెస్తానని. ఆమె తన కొడుకుని పంపింది డబ్బులు తెమ్మని.

'మోహన్ వాకిట్లోంచి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఇంటి లోపల్నుంచి గట్టిగా కేక. తలుపు దగ్గరే ఆగిపొమ్మని' ఇంటి ముసలామె నుంచి అభ్యంతరం.

'మోహన్ లోపలికెళ్ళకు అక్కడే ఆగు' తల్లి నుంచి ఆజ్ఞాపన.

అప్పటికే రెండు అడుగులు లోపలికేసిన ఆ పసివాడు వెనక్కు వచ్చి గుమ్మం వెలుపల నిల్చున్నాడు. ఆ ఇల్లాలు తెచ్చి ఇచ్చింది. ఆమెది అతడి తల్లి వయస్సే.

'అమ్మా. ఆ ముసలామె ఎవ్వరు?"

"ఆళ్ళిద్దరూ అత్తా కోడళ్ళు"

'నన్నెందుకు లోపలికి రావద్దు అంది!'

'కరణాలు, బాపన్లు ఆళ్ళ ఇండ్ల లోపలికి వేరెవ్వర్నీ రానియ్యరు. కాళ్ళ దుమ్ము రాల్తదని.

'అంటరానివాళ్ళను మనింట్లకు రానియ్యనట్లే, ఈళ్ళు మనల్ని రానియ్యరన్నమాట'

'ఆళ్ళకు మనకు పోలికెట్లరా. ఆళ్ళు అంటరానివాళ్ళు. ఆళ్ళని తాకితే మైల పడిపోతారు. కాళ్ళ దుమ్ము ఆళ్ళ ఇంట్ల పడ్తది అని రావద్దు అన్నారు. కాళ్ళు కడుక్కొని పోవచ్చు"

"అమ్మా! మైలకు దుమ్ముకు తేడా అంది. చెమట, దుమ్ము కలిస్తే మైల కదా. మరి ఈదురుగాలి, సుడిగాలి ఈసినప్పుడు బజార్ల దుమ్ము, పెంటగడ్డల మీది సెత్తంతా ఇంట్ల కొస్తదిగా.

'సదువుకొని తిక్కతిక్కగా మాట్లాడుతున్నావు..." అంటుండగానే అయ్యగారి వాకిట్లోకి వచ్చేశారు ఆ తల్లీ కొడుకులు. ఈమె గొంతు విన్న అతడు 'లక్ష్మమ్మా! కూరగాయలిద్దువురా. ఈ సారి సాన రోజులకొచ్చినట్లున్నవ్' అంటూ అతడు సాదరంగా ఆహ్వానించాడు. తమ బాయిగడ్డ మీద వేపచెట్లు కింద వెంకటేశ్వర్ల స్వామి దేవుడున్నాడు. శిల్పి చెక్కిన ఆకారం కాదు ఆ విగ్రహం. ఒక బండని దెచ్చి సున్నంతో మూడు నామాలు దిద్ది చెట్టు కింద పాతి పెట్టారంట ముత్తాతల కాలంల. పంట మీద ఏడాదికోమారు చేసే పండుగకు ఈ అయ్యగారు పూజారి.

గంట సేపట్నుంచి వీధులు తిరిగిన ఆమె కాళ్ళు అలసిపోయాయి. కొద్ది సేపు కూర్చోవాలన్పించింది. ఆ ఇంటి ముందర చేద బావి ఉంది. మోట గిలకకు చేద సిద్ధంగానే వుంది. నెత్తిమీదున్న గంపని అరుగు మీద దించి నీళ్ళు చేది కాళ్ళు కడుక్కుంది. కొడుకు కాళ్ళని కడిగించింది. గంపతో ఇంటిలోనికెళ్ళింది. అయ్యవారికి కావలసిన కూరలు ఇచ్చింది.

'నీ కొడుకు పెద్దోడు అయినట్లుండు. ఏం సదువుతున్నావురా" ఆ చిన్న వాడ్ని పలకరించిన అయ్యవారికి 'నాల్గోతరగతి' అని సమాధానమిచ్చాడు.

ఆ అయ్యగారితో ఓ పావుగంట సేపు మంచి చెడు మాట్లాడిందామె. గంపలో ఇంకొద్దిగానే ఉన్నాయి కూరలు. సంచీలో పైకం లెక్కించింది. ఇంకో నాలుగైదు ఇళ్ళల్లో అమ్మితే అయిపోతాయని భావించి తిరిగి గంపనెత్తుకుంది.

"అమ్మా!" కొడుకు.

'మళ్ళేందిరా"

'అయ్యగారు, బాపనాయనగదా. మరి మనల్ని ఇంట్లకు రానిచ్చి కూర్చోబెట్టుకుండుగా'

"ఆయన శాస్త్రాలు తెలిసిన వాడు. పెళ్ళాం సచ్చిపోయింది. గొల్లామె అంటు గిన్నెలు కడిగి, ఇల్లు వాకిలి ఊడస్తది. పిల్లలు సిన్నోళ్ళు వంట అయ్యగారే చేస్తడు" కొడుకు సందేహాన్ని అర్థం చేసుకొని అందామె.

కూరల గంప ఖాళీ అయింది. ఆ తల్లీ కొడుకులు తమ పల్లెకు తిరుగుముఖం పట్టారు. 'అమ్మా విశ్వనాథం వడ్లాయన గదా. మన బాయికాడికి నాగలి జేస్తందుకు ఒస్తే సానరోజులకొచ్చినవని నాన్న కొట్టబోయిండుగా. ఆళ్ళు మనకన్నా తక్కువా?'

'అసలు వడేనరికి అరకలు తయారులేకపోతే దున్నేది ఎట్లు. తడిమీద ఇత్తనం పడకపోతే పంట పండదుగా. ఆ కోపమ్మీద నాయన భయం జెప్పబోయిండు. ఆళ్ళ మనకు పనోళ్ళు అయితరు. వడ్ల, కమ్మరోళ్ళు మనకు పని చేయడం వారి బాధ్యత. చేపించుకోవడం మన హక్కు రైతుల అళ్ళకు

(మిగతా 23 పేజీలో)

మానవతా దర్శనం

కథా రచయిత్రి, నాటక రచయిత్రి అయిన అత్తలూరి విజయలక్ష్మి నేను అభిమానించే రచయిత్రే కాకుండా, కుటుంబ మిత్రురాలుగా కూడా నాకు ఆత్మీయురాలు.

విజయలక్ష్మి మొట్టమొదటి కథా సంపుటి 'అపూర్వ కథలు' గురించి పుస్తక ఆవిష్కరణ సభలో ప్రసంగించే అవకాశం కలిగింది నాకు. ఆ కథల్లో ఎక్కువగా స్త్రీ అస్తిత్వాన్ని, స్వాభిమానాన్ని చిత్రించిన తీరు నన్ను ఆకట్టుకుంది.

విజయలక్ష్మి రెండవ కథా సంపుటిలోని కథలు ఎక్కువగా మానవత్వాన్ని చాటి చెప్పాయి. నిత్య జీవితంలోని యాంత్రిక జీవన విధానంలో మానవతా దృష్టి మరుగున పడిపోతున్న సమయంలో పాఠకులకు మానవతా దర్శనాన్ని కలుగజేస్తాయి ఈ కథలు. ఇందులోని పదిహేను కథల్లోనూ వివిధ కోణాల నుంచి స్త్రీల సమస్యలను చిత్రిస్తూనే, స్త్రీ పురుషుల్లో మానవతా దృక్పథాన్ని మేల్కొల్పడానికి ప్రయత్నించిందీ రచయిత్రి. ఈ 'అపురూప కథ'ల్లో బాలల, వృద్ధుల మనస్తత్వాలనీ, ఆకాంక్షల్నీ అర్థంగా, ఆవిష్కరించిన కథలూ, కొన్ని మూఢ విశ్వాసాలను నిరసిస్తూ రాసిన కథలూ, మూఢాచారాలనుకునే కొన్నిటిలోని సద్భావన గురించి రాసిన కథలూ ఉన్నాయి.



అపురూప కథలు
రచన : అత్తలూరి విజయలక్ష్మి,
వెల : రూ. 50/-,
ప్రతులకు : నవయుగ బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్.

అత్యాధునిక శైలిలో మన రాష్ట్ర రాజధాని సాధించిన ప్రగతి కేవలం పైపై మెరుగేననీ, బడుగు వర్గాల జీవనం ఇంకా అట్టడుగు స్థాయిలోనే ఉందనీ సోదాహరణంగా చూపించిన కథ ఈ సంపుటిలోని మొట్టమొదటి కథ 'మేరీ అవాజ్‌సునో'. చదువుకుని పైకి రావాల్సిన వయస్సులో, వీధుల్లో చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ, తాము అమ్మేవాటిని కొనమనీ, తమ పొట్టనింపమనీ ధనవంతుల్ని ప్రాథేయపడుతూ బతికే పిల్లలు హైటెక్ నాగరికతలోని అపశ్రుతులు అనీ, వాటిని సరిదిద్దుకోవాలని బడాబాబుల్ని హెచ్చరిస్తుంది ఈ కథ.

రాజకీయ - సామాజిక స్పృహతో రాసిన మరో కథ 'ఆయన కోరిక'. నిస్వార్థపరులైన, నిజమైన స్వాతంత్ర్య సమరయోధులు ఎంతోమంది నేటికీ అనామకంగా మిగిలిపోయి కేవలం స్మృతులతో గడుపుతున్నారని మనకి తెలుసు. అటువంటి ఒక వృద్ధుడి తీరని చిరుకోరిక సమాజమూ, ప్రభుత్వమూ తీర్చక పోయినా, స్వాతంత్ర్య దినం నాడు తమ ఇంటి ఆవరణలో ఆయన మనవలే తీర్చడం ఆనందాన్ని కలిగిస్తుంది.

స్త్రీల పట్ల ఆర్తితో రాసిన కథల్లో 'మాతృభాష' ప్రత్యేకంగా చెప్పుకోదగిన కథ. దాని శీర్షిక కూడా అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా ఉంది. రెక్కల కష్టం మీద బతుకుతూ కూతుర్ని చదివించి సన్మార్గంలో పైకి తీసుకురావాలని ఆరాటపడిన తల్లి విలువని ఆమె ఆకస్మిక మరణానంతరం మాత్రమే తెలుసుకున్న కూతురు, తన ఆవేదనని స్నేహితురాలికి లేఖారూపంలో వ్యక్తం చేసిన కథ ఈ 'మాతృభాష'.

అమ్మ గురించి రాసిన మరో కథ 'అమ్మ ఇష్టం', భర్త, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు - అందరి ఇష్టాలనీ గుర్తుంచుకుని రకరకాల వంటలతో అందరికీ ఆనందాన్ని కలిగించిన ఇల్లాలికి ఏ ఏ పదార్థాలు ఇష్టమో గ్రహించడానికి ఏనాడూ ప్రయత్నించని కుటుంబ సభ్యులు ఆ ఇల్లాలి మరణానంతరం ఎలా స్పందించారో చూపించిన కథ ఇది.

భార్యపోయిన వెంటనే పునర్వివాహం మూడుసార్లు చేసుకున్నాడని రహీం అనే ప్యూన్‌ని ఆఫీసులో ఉద్యోగులంతా హేళన చేస్తుంటే, అతని పట్ల కొంత సానుభూతి ఉన్న ఒక ఉద్యోగిని మాత్రం తన వివాహానికి అతను ఇచ్చిన అపురూపమైన బహుమానాన్ని బట్టీ, తరువాత అతను సెలవు తీసుకున్న విధానాన్ని బట్టీ అతని విచిత్ర ప్రవర్తనకి ఆశ్చర్య పడుతుంది. తరువాత అతను మనసు విప్పి చెప్పిన అతని జీవితానుభవాల గురించీ, అతను ఒక హిందూస్త్రీ పట్ల చూపిన ఔదార్యాన్ని గురించి విన్నమీదట అతనిలో పరిమళించే మానవత్వాన్ని గ్రహించాక అతని పట్ల ఎంతో గౌరవభావం కలుగుతుంది ఆమెకి. ఆ భావాన్ని పాఠకుల్లో కూడా కలిగిస్తుంది రచయిత్రి.

ఈ కథా సంపుటి శీర్షికకి ఆధారమైన 'అపురూప' అనే కథలోని కథా వస్తువు కూడా అపురూపమైనదే. తను ఏనాడూ అనుభవించని స్వేచ్ఛనీ, విద్యావకాశాలనీ కూతురికి కలుగజేస్తే, ఆ కూతురు ఆ స్వేచ్ఛని ఎలా ఉపయోగించుకుందో, మాతృత్వం పట్లా, వివాహం పట్లా ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో, ఆ తరువాత పరిణామాలకు ఎలా పరితపించిందో చూపే కథ ఇది. వివాహం కాకుండా గర్భవతి కావడాన్ని, పిల్లని కనిపారెయ్యడాన్ని కథా నాయిక చాలా తేలిగ్గా తీసుకున్నా, తీరా పిల్లని కన్న తరువాత ఆ పాప ఎలా పశ్చాత్తాపడిందో చెప్పి, ఆధునిక యువతులు స్వేచ్ఛని ఎంత బాధ్యతాయుతంగా తీసుకోవాలో తెలియజెప్పిన కథ 'అపురూప'

ఇటువంటి ఆలోచనాత్మకమైన కథలురాసిన అత్తలూరి విజయలక్ష్మిని మనసారా అభినందిస్తున్నాను.

- అబ్బూరి ఛాయాదేవి

స్వీకారం



ఈ చిన్న పుస్తకం గుజరాత్ మీద విశ్లేషణతో ప్రారంభించి హిందూత్వ స్వభావాన్ని, దాని ప్రాపంచిక దృక్పథాన్ని వివరించడానికి ప్రయత్నిస్తుంది. ఇటీవల కాలంలో హిందూత్వ-హిందూయిజం; మతం-మతతత్వం-లౌకికవాదం మధ్య జరుగుతున్న సైద్ధాంతిక ఘర్షణలు ఇది మనముందుకు తెస్తుంది. భారత రాజ్యాంగం, దాని లౌకిక ప్రజాస్వామ్య స్వభావం, మానవ హక్కులు, హిందూత్వం వంటి అంశాలను ఇది వివరిస్తుంది. మన ముందున్న ప్రమాదకర శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరును ఈ పుస్తకం బలోపేతం చేస్తుందని ఆశిద్దాం.

లౌకిక వాదం-మతతత్వం-హిందూత్వ

అనువాదం : పి.రాజగోపాల్; **వెల :** రూ. 5/-;
ప్రతులకు : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఆంధ్రప్రదేశ్ కమిటీ, 1-1-9/12, జవహర్‌నగర్, హైదరాబాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

కథకులు వేల సంఖ్యలో వున్నారు. వారిని గురించి విజేత ఆదివారం అనుబంధంలో ప్రచురించారు. ఈ పుస్తకంలో ప్రస్తుతం 122 మంది కథకులను కథా కిరణాలు శీర్షికన పరిచయం చేశారు. ఇందులో పాత కొత్త కథా రచయితల వివరాలు వున్నాయి.

కథాకిరణాలు

మన తెలుగు కథకులు
రచన : పైడిమర్రి రామకృష్ణ; **వెల :** రూ. 50/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, నవోదయబుక్‌హౌస్ హైదరాబాద్



ఈ పుస్తక రచయిత్రి రాసిన, వివిధ పత్రికలలో ప్రచురితమైన 12 కథలతో ఈ పుస్తకాన్ని ముద్రించారు.

పుట్టి - బంగారం

రచన: కె.వరలక్ష్మి;
వెల: రూ. 50/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, నవయుగ బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్

ఘనీ పూడ్చి పెట్టాడు.

ఆ తర్వాత సోనీరాబీ దుఃఖంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోయింది. అక్కడ కూడా ఆమె తన భర్త తన కొడుకును గొంతు నులిమి చంపిన విషయాన్ని తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. కానీ సోనీరాబీ సోదరుడు ఆమెను నెమ్మదిగా అడగటంతో తన కొడుకును తన భర్త దారుణంగా గొంతు పిసికి హత్య చేసిన విషయాన్ని చెప్పింది. అన్ని వివరాలను పూసగుచ్చినట్లు తెలిపింది. ఆమె సోదరుడు సయ్యద్ రోషన్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన బావ సయ్యద్ ఘనీపై ఫిర్యాదు చేశాడు. ఈ సమాచారంతో పోలీసులు సయ్యద్ ఘనీపై ఇండియన్ పీనల్ కోడ్ 302 కింద హత్య కేసును నమోదు చేశారు.

పోలీసులు బాలుని శవాన్ని పైకి తీసి డాక్టర్ల చేత పోస్టుమార్టమ్ చేయించారు. డాక్టర్ జయరామ్ పోస్టుమార్టమ్ రిపోర్టు రాశారు. శిశువు గొంతును, ఛాతినిగట్టిగా నులమటం వల్ల చనిపోయినట్లు డాక్టర్ ధృవీకరించాడు. పోలీసులు హత్యానేరం కింద సయ్యద్ ఘనీపై ఛార్జిషీట్ దాఖలు చేశారు.

ఈ హత్యకేసు నాందేడులోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. సోనీరాబీ కోర్టులో హాజరై తన భర్త మీద ఉన్నదున్నట్లుగా సాక్ష్యం చెప్పింది. తన పెళ్ళికి ముందు తనను గర్భవతిని చేసి, మొదటి భర్తతో తలాక్ తర్వాత తనను మళ్ళీ పెళ్ళి చేసుకొని తనకు పుట్టిన మగశిశువును తన కళ్ళముందే ఒకరోజు తెల్లవారుజామున తన భర్త సయ్యద్ ఘనీ చంపిన విషయాన్ని న్యాయస్థానంలో వివరించింది. దానికితోడు ఆమె సోదరుడు, ఆమె తల్లిదండ్రుల సాక్ష్యం ఒకే విధంగా ఉండడంతో నాందేడు సెషన్స్ జడ్జి కన్న కొడుకును హత్య చేసిన కసాయి తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

ముద్దాయి జిల్లాకోర్టు తీర్పు మీద మహారాష్ట్ర హైకోర్టులో అప్పీలు చేసుకున్నాడు. ముద్దాయికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు బలంగా ఉండటంతో మహారాష్ట్ర హైకోర్టు నాందేడు కోర్టు తీర్పును బలపరుస్తూ కింది కోర్టు విధించిన జీవిత ఖైదును ఖరారు చేసింది. మళ్ళీ ముద్దాయి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు చేశాడు. కానీ సుప్రీంకోర్టులో కూడా రెండు కోర్టుల తీర్పులను పరిశీలించిన జడ్జీలు అదే శిక్షను విధిస్తూ ముద్దాయి అప్పీలును తిరస్కరించారు. ముద్దాయి ప్రస్తుతం యావజ్జీవ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ◆

మైల

(19వ పేజీ తరువాయి)

ఆసాములు. పంట మీద గింజలు తీసుకపోతరుగా" అని వివరించిందామె.

'మరి నాగళ్ళు జేస్తందుకు వొచ్చినప్పుడు ఆళ్ళు మనింట్ల అన్నం తినలేదుగా. బియ్యం, పప్పులు తీసుకొని ఆళ్ళే ఒండుకున్నరెందుకు?'

'మనం కులానికి ఎక్కువే. ఎండల పొలం పని జేస్తము. సెమట పడ్తది. ఆళ్ళు సెట్టుకింద నీడకు పని జేస్తరు. మన వంటలు ఆళ్ళకు సయించవు. స్నానం చేసి మనమిచ్చిన బియ్యం, ఉప్పు, పప్పు, కారం, చింతపండు తీసుకొని సాయంపాకం తింటరు."

'అంటే ఆళ్ళు మన వంటల్ని అంటరన్నమాట' ఆ పసివాడికి బోలెడు సందేహాలు. ఈ చిక్కులు ఎంతకూ అర్థం కావు. కులం కన్నా పరిశుభ్రం ముఖ్యం అని అర్థం అయింది ఆ పసి మనస్సుకు.

* * *

ఏడవ తరగతి పాసైన మోహన్ హైస్కూలు చదువుకని హైదరాబాద్ వెళ్లాడు. అద్దెకు ఉంటున్న గదికి దగ్గరలోనే ఉన్న కిరాణా దుకాణం యజమాని సంతోష్‌తో సాన్నిహిత్యం పెరిగింది. స్నేహానికి వయస్సు తేడా అడ్డు రాలేదు.

మాటల సందర్భంలో బోనగిరి చుట్టు పక్కల గ్రామాల్లో విస్తరాకులు ఎండాకాలంలో పనులు లేనప్పుడు కుట్టుతారని, ధర చాలా తక్కువ ఉంటుందని తెలుసుకున్న సంతోష్ అట్లా వెళ్ళి తెచ్చుకుంటే లాభం ఉంటుందని భావించి యాదగిరి గుట్టకని చెప్పి మోహన్ని తనతో తీసుకెళ్ళాడు.

చిన్నతనంలో తల్లివెంట వెళ్ళినప్పుడు తల్లి ఎప్పుడో ఓ మూల మలుపు చూసి కూరగాయలు అనేది. అట్ల పలకడానికి తన కాపుదనం అడ్డమొచ్చేది. కాని సంతోష్ కొత్త ప్రాంతంలో 'విస్తళ్ళు కొంటాం, విస్తరాకులు కొంటాం' అంటూ కేకలు వేస్తుంటే వెంట వెళ్ళాలంటే మోహన్‌కు సిగ్గుగా అన్పించింది.

అయితే అది ఆకులు కుట్టే సీజను కాదు. ఇళ్ళల్లో నిల్వ వున్నవి ఓ వందకు పైగానే విస్తరాకుల కట్టలు దొరికాయి. కట్టకు వంద ఆకులుంటాయి. అప్పటికి జాము పొద్దు దాటింది. రైతులంతా పొలం పనులకు వెళ్తున్నారు. ఉదయం నుంచీ ఏమీ తినలేదు. ఇద్దరికీ ఆకలిగా ఉంది. భోనగిరికెళ్ళితే కాని హోటలు తిండి దొరకదు.

ఓ కాపు స్త్రీ వారిని భోజనానికి పిలిచింది. సంతోష్ సిద్ధమయ్యాడు. కాని మోహన్ ఆమెను పరిశీలనగా చూశాడు. తలకు నూనె లేదు. చింపిరి జుత్తు. కట్టిన చీర మురికిగానే ఉన్నది. ఆమెలో అపరిశుభ్రత తాండవిస్తోంది. నోటి నుంచి సొల్లు కూడా కారుతుందేమోనని ఊహించాడు మోహన్. అట్లాంటి అపరిశుభ్రమైన చేతులతో వండిన అన్నం, కూర తినడమా... తానుతినలేడు. వద్దన్నాడు. సంతోష్ తిందామన్నాడు. నువ్వు తిను నాకు వద్దన్నాడు.

పేరుఅడిగింది ఆమె.

మోహన్‌రెడ్డి.

'ఏ ఊరు'

'జూలూరు దగ్గర' తన ఊరి పేరు సూటిగా చెప్పలేదు.

'ఈ ప్రాంతమే. మేమూ కాపులమే. ఏదో కులము అనుకుంటున్నట్లున్నావ్. ఒకే కులపోళ్లమే. తినయ్యా ఆకలితో ఎట్ల ఉండవ్"

ఆమె కుల ప్రస్తావన మోహన్ని నిరుత్తరుడ్ని చేసింది. తనకు కులభేదం ఉద్దేశించినందుకు బాధగానూ ఉంది. అయినా భోం చేయలేదు. మంచినీళ్ళు తాగాడు. సంతోష్ భోంచేశాడు. అతడు ఆ ఇల్లాలికి నమస్కారం పెట్టి సెలవు తీసుకున్నాడు.

'రెడ్డీ. మేము కుర్మలం. మీకన్నా తక్కువ కులపోళ్ళం. నువ్వు ఉంటున్న ఇంటి యజమాని కూడా గౌడు. వాళ్ళింట్ల, మా ఇండ్లళ్ళ కార్యాలు జరిగినప్పుడు భోంచేస్తవుగా. మీ కులపామె అంత ఇదిగా బత్మిలాడినా తినకపోతివి ఎందుకు?' ఊరి వెలుపలికి వచ్చాక అడిగాడు సంతోష్.

"సంతోష్ నాకు కులం పట్టింపు లేదు. ఎక్కువ తక్కువ అన్న భేదము లేదు. మీరంతా పట్న వాసపు వాళ్ళు. శుభ్రంగా ఉంటారు. వంటలు రుచిగా ఉంటాయి. నాకు బాధగానే ఉంది. ఆమె అంత ఆప్యాయంగా భోం చేయమన్నది. ఆమె ఎంతో బాధపడుంటది. కాని నాకు ఆమె మురికిగా అగుపించింది. ఆ మురికి చేతులతో చేసిన వంట నాకు సయించదు. మా చుట్టాల ఇంట్లో కూడా అపరిశుభ్రంగా ఉండే వారి వంట తినాలంటే సయించదు" అన్నాడు మోహన్ పరిశుభ్రతకే పెద్దపీటేస్తూ. ◆

కులాతీత వివాహ వేదిక

వధువు కావలెను

✡ 25/5'/ ఇంటర్/సొంత వ్యాపారం చేస్తూ నెలకు 6 నుండి 7 వేల వరకు సంపాదన వున్న, ఎలాంటి దుర్వ్యసనాలు లేని వరునికి విశాల భావాలు కల ఇంటర్ లేదా డిగ్రీ చదివిన వధువు కావలెను. బాక్స్ నెం : **224,** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 35/5'5"/ తెలుపుఛాయ/పోస్టల్ శాఖలో సీనియర్ క్లర్క్‌గా పని చేస్తూ నెలకు రూ.10,000 జీతం, ఇతర అలవెన్సులు పొందుతున్న, సామాజిక కళారంగాలలో అనుభవం కలిగిన వరునికి తగిన వధువు కావలెను. పిల్లలు లేని వితంతువులు కూడా సంప్రదించవచ్చు. బాక్స్ నెం : **225,** కేరాఫ్ ప్రజాశక్తి.

అనర్థదాయకం

కొండబాబు



"తొలుత మన మంత్రిగారు మాట్లాడతారు" నోడల్ అధికారి మైకులో ప్రకటించారు.

మంత్రిగారు మైకందుకున్నారు. "ప్రజలారా ఈ జన్మభూమి కోసం రెండొందలేభై కోట్ల రూపాయలను కేటాయించాం. ఏ అధికారులైనా మీ సమస్యలను పరిష్కరించకపోతే వారిని నిలదీయండి. మీరు చైతన్యవంతులయితేనే అధికారులు మాట వింటారు..."

సభలోంచి ఎవరో అరిచారు. "అంతకుముందు ఇచ్చిన వినతిపత్రాలలోని సమస్యలను ఇప్పటివరకూ పట్టించుకోలేదు"

"వెంటనే ఇక్కడి అధికారిని సస్పెండ్ చేయండి" ప్రసంగం మధ్యలోనే మంత్రిగారు ఆదేశించారు.

"అంతకుముందు కూడా అధికారిని సస్పెండ్ చేశారు కానీ మా సమస్యలను పరిష్కరించలేదు" మరికొందరు మహిళలు అరిచారు.

"కూర్చోండమ్మా... మిమ్మల్ని ఎవరు రెచ్చగొడుతున్నారో మాకు తెలుసు. ప్రతిపక్షాల వారు రాజకీయం చేస్తున్నారు. రాజకీయాలు వద్దు... అభివృద్ధే"

"పింఛన్లన్నీ నెలల తరబడి ఇవ్వకుండా ఆపి ఇప్పుడు ఇస్తున్నారు. జన్మభూమిలో ఇంతకంటే ఏం చేస్తున్నారు? పింఛన్ల డబ్బునే కొత్త కేటాయింపుల్లాగా చెబుతున్నారు?" ముందున్న యువకుడు ప్రశ్నించాడు.

"ప్రజలారా మీరు చైతన్యవంతులు కావాలి. ఇలా సభలను అడ్డుకునే వారిని నిలదీయాలి. వీళ్ళే అభివృద్ధి నిరోధకులు..." సాగిపోతోంది మంత్రిగారి ప్రసంగం.

* * *

మన తెలుగునాట కొన్నేళ్ళుగా పాలకుల సభల తీరు ఇలాగే ఉంటున్నది. అత్యుక్తేమీ కాదు. ఇలా ఒక సభ అనే కాదు... అనేక సభలు, పాత్రికేయుల సమావేశాల్లోను ఈ సభలోలాగే అనేక పదాలను నాయకులు అలవోకగా ప్రయోగిస్తుంటారు. ఆ పదాలకు కొన్ని అర్థాలున్నాయి. ఆ అర్థాలతోనే భాషాపండితులు, పామరులతో సహా అందరూ వాడతారు - 'కొన్ని' రాజకీయ పార్టీల నాయకులు 'కొందరు' మినహా.

ఆ పదాలను ఆ నాయకులు తరచూ వాడటం వల్ల అవి జనసామాన్యంలో విరివిగా వాడుకలోకొస్తాయి. కానీ, అదే సమయంలో 'ఆయా నాయకులు' వాడిన అర్థాలలోనే అవి అర్థ పరిణామం చెందుతుంటాయి. ఇదొక ప్రచారం. ప్రజలకు తెలిసిన అర్థం వేరు. వీరు వాడే, ప్రచారం చేసే అర్థం వేరు కావడం వల్ల ప్రజలు గందరగోళపడతారు. తెలియాల్సిన విషయాలు తెలియకుండా పోతాయి. తెలిసిన మేర వాస్తవం కాకుండా చెప్పిన వారి అర్థంలోనే తెలుస్తాయి. దీనివల్ల వాస్తవాలు మరుగున పడిపోతాయి. ఇది ఎలా జరుగుతున్నదో మచ్చుకు మరి ఒకటి రెండు పదాలను పరిశీలించి తెలుసుకుందాం.

ఉపోద్ఘాతంలో పేర్కొన్న సభల్లాంటి సభలు యథాతథంగా అలాగే కొన్ని వందలు జరిగాయి. జరుగుతున్నాయి. అవే సంభాషణలు కూడా.

ఆ సభలో ఒక పక్క ప్రజలు చైతన్యవంతులు కావాలంటున్న మంత్రిగారు సమస్యల గురించి ప్రశ్నిస్తున్న వారిని కూర్చోబెడుతున్నారు. ప్రజలు చైతన్యవంతులై అభివృద్ధిని అడ్డుకునే వారిని అడ్డుకోవాలంటున్నారు. ప్రశ్నించిన వారిది చైతన్యం కాదా? కాదు కాబోలనే అనుకుంటారు మంత్రిగారి మాటల వల్ల. పైగా వాళ్ళు చెప్పేదే ఏదో 'అభివృద్ధ'నే గొప్ప విషయమని, సమస్యలను ఏకరువు పెట్టడం అభివృద్ధి నిరోధకమనీ అనుకుంటారు. అనుకునేలాగా ప్రచారమూ చేస్తారు. అలాగా ఆయా పదాల అర్థాలు మారిపోతుంటాయి. ఇక్కడే చూడండి ఇప్పటికే చైతన్యం, అభివృద్ధి, సమస్య... అనే పదాల అర్థాలను మార్చేశారు! ఇంకా చూద్దాం.

'రాజకీయం' చేస్తున్నారట. 'రాజకీయం' అంటే అసలు అర్థం ఏమిటి? పరిపాలన గురించిన విషయం, పాలన ఎలా జరగాలి? లాంటి విషయాలు. మరి రాజకీయం చేయడమేమిటి? దానికి అర్థమే లేదు. మంత్రిగారి ఉద్దేశం ప్రకారం దాని అర్థమేమిటంటే 'లేనిపోని రచ్చచేయడం' రచ్చ చేయడం తప్పుకాదు. లేనిపోని రచ్చ చేయడమే తప్పు అనేది వారి మాటలకర్థం. చూశారా వాస్తవాన్ని ఎలా మార్చేశారో! అంటే ప్రజలకు నష్టం చేకూర్చే, మేలు చేకూర్చని పనులను ప్రజలు కూడా విమర్శించకూడదు. విమర్శిస్తే 'రాజకీయం' చేయడమే. అంటే లేనిపోని రచ్చ చేయడమే. పాలన విషయాలు, ప్రజలకు ఏమి మేలు జరగాలి? ఎలా మేలు జరగాలి? అనే అంశాలు తెలుసుండటాన్ని 'లేనిపోని రచ్చగా' కొట్టి పారేస్తున్నారు, అంటే ప్రజలు అవగాహన, విజ్ఞానం లేకుండా ఉండాలన్నమాట. అప్పుడే కదా వారు చెప్పిందే వేదం అయ్యేది. కావున భాషకు సంబంధించి ఇలాంటి అనర్థదాయకమైన అర్థ పరిణామాన్ని ఎవరూ సహించకూడదు. ◆

పాఠక స్పందన

బహుముఖ ప్రజ్ఞాశాలి

జనవరి 5 ఆదివారం అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన 'శేషభట్టర్' వ్యాసం బాగుంది. రచనా ప్రక్రియకు ఆయన చేసిన సేవ అజరామరం. రచనలో తనదైన శైలిని ఎంచుకొన్న ప్రజ్ఞాశాలి ఆయన.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

చారిత్రక నేపథ్యం

2002 డిసెంబర్ 22న అందించిన కవర్ స్టోరీ మెర్రీ క్రిస్మస్ విశేషాలు చారిత్రక నేపథ్యంతో గుభాళించాయి. ఏసుక్రీస్తు పుట్టుక, క్రీస్తు మరణానంతరం దాదాపు అన్ని దేశాల్లో క్రైస్తవ మత విస్తరణ, ఆనాటి రోమ్ పాలకులు, మత ఛాందస వాద నియంతృత్వ ధోరణులు, క్రైస్తవ అనుయాయుల మత విశ్వాసాలు, క్రిస్మస్ చెట్టు, క్రిస్మస్ తాత, నక్షత్రం మొదలైన ఎన్నో విషయాలను ఈ వ్యాసం కళ్ళముందుంచింది. ఎంతో విలువైన సమాచారాన్ని అందించింది. పుక్కిట పురాణగ్రస్థ అంశాలను మాత్రమే కాక ఏసుక్రీస్తు శిలువకు దారితీసిన పరిస్థితిని వివరించడం చరిత్రకు అద్దం పట్టాయి.

- మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా

టూరిస్ట్‌గైడ్ బాగుంది

డిసెంబర్ 29 సంచికలో టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురించిన 'యాదగిరిగుట్ట' విశేషాలు ఆకట్టుకున్నాయి. ఆలయ చరిత్ర, అక్కడున్న కట్టడాల గురించి తెలుసుకోగలిగాము.

- నాళ్ళా సునీల్, తిరువూరు, కృష్ణాజిల్లా